

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

## కరీంనగర్

పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల

మంగళవారం 8 జూలై 2025 15 పేజీలు


# ప్రపంచమే గర్వపడేలా క్రీడల్లో రాణించాలి





- కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్‌కు మంచి పేరు తేవాలి
- స్పోర్ట్స్ స్కూల్‌ను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేస్తాం
- క్రీడలు, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకటి శ్రీహరి
- మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి పలు అభివృద్ధి పనుల ప్రారంభం



**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

ప్రపంచమే గర్వపడేలా క్రీడల్లో రాణించాలనీ, కరీంనగర్‌లోని రీజనల్ స్పోర్ట్స్ స్కూల్‌కు రాష్ట్రంలోనే మంచి తీసుకురావాలని క్రీడలు, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకటి శ్రీహరి పేర్కొన్నారు. కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్‌కు (మిగతా 2లో)

### పోలీసుల నైపుణ్యం, సామర్థ్యం,

# ప్రతిభను గుర్తించడానికే ఈ పోటీలు

- పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఐపీఎస్
- కరీంనగర్‌లో రాజన్న జోన్ స్థాయి తెలంగాణ స్టేట్ పోలీస్ డ్యూటీ మీట్ పోటీలు ప్రారంభం

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

పోలీసు వృత్తిలో మరింత నైపుణ్యం, సామర్థ్యం, ప్రతిభ పెంపొందించుకునేందుకు ఈ 'పోలీసు డ్యూటీ మీట్'ను నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ పేర్కొన్నారు. నేర దర్యాప్తులో మరింత శాస్త్రీయత, నైపుణ్యం కనబరిచే విధంగా ఈ పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు.తెలంగాణ రాష్ట్ర రెండవ పోలీస్ డ్యూటీ మీట్ జూలై నెలలో వరంగల్‌లో నిర్వహించనున్నారు. దానిలో భాగంగా డీజీపీ ఆదేశాల మేరకు రాజన్న జోన్ పరిధిలోని కరీంనగర్, సిద్దిపేట పోలీస్ (మిగతా 2లో)





# సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి పటిష్ట చర్యలు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పీఎం కుసుమ్ పథకం అమలుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పిఎం కుసుమ్ పథకం క్రింద రైతులు లేదా రైతు సహకార సంఘాలు వారి భూమిలో 500 కిలో వాట్ల (మిగతా 2లో)

### అభివృద్ధి పనులతో రెండు మండలాలను

# ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయండి
- కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

8లో

**సూర్య మేడిపల్లి / భీమారం**





నేటి దినపత్రిక సూర్య www.suryaa.com

రాజన్నసిరిసిల్ల

మంగళవారం 8 జూలై 2025 3


# ప్రజావాణి అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

## - కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**సూర్య, రాజన్న సిరిసిల్ల**

ప్రజావాణిలో వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 151 దరఖాస్తులు కలెక్టర్ స్వీకరించి, వాటిని పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.సోమవారం నాటి ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు 48, హౌసింగ్‌కు 36,



డీఆర్‌డీఓకు 23, డీపీఓకు 10, జిల్లా విద్యాధికారికి 8, జిల్లా ఉపాధి కల్పనాధికారికి 5, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్, జిల్లా సంక్షేమ అధికారికి మూడు చొప్పున, ఎస్‌డీసీకి 2, ఎస్పీ, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్, ఈఈ ఇరిగేషన్, ఎండిసెస్, ఎల్‌డిఎం, ఈఈపీఆర్, ఈఓఎస్‌ఆర్ఆర్ టెంపుల్ వేములవాడ, జిల్లా పౌరసరఫరాల అధికారి, మున్సిపల్ కమిషనర్ వేములవాడ, ఏడీ ఎస్ఎల్ఆర్, జిల్లా వైద్యాధికారి, ఈడీఎస్సీ కార్పొరేషన్, ఈడీఎంకు ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి.కార్యక్రమంలో జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీఆర్డీఓ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

## - జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

**సూర్య, రాజన్న సిరిసిల్ల**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు.సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 23 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్



సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు.పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. అధికారుల పనితీరుతోనే ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యంపై వినూత్న నిరసన

**సూర్య, సిరిసిల్ల టౌన్**



రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్,ఫీజు రిఇంబర్స్మెంట్ విడుదల చేయకపోవడం నిరసిస్తూ సిరిసిల్ల జిల్లా కేంద్రం పాత బస్టాండ్‌లో బిఆర్ఎస్ నాయకులు కంచర్ల రవి గౌడ్ ఆధ్వర్యంలో భిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌ను వెంటనే విడుదల చేయాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.ప్రభుత్వం 700 కోట్లు బకాయి పడటం వలన పేద,మధ్యతరగతి విద్యార్థులకు స్కాలర్షిప్స్ రాకపోవడం ఇబ్బందులు దీనివలన వారి భవిష్యత్తు అంధకారమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి విద్యార్థుల బంగారు భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని వెంటనే పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు మట్టి శ్రీనివాస్,వద్దూరి సాయి,సూర్య,ముద్దం అనిల్,ఎండి అజ్జు,అనిల్ గౌడ్,ఎస్.కె అఫ్రోజ్, వి.శ్రీనివాసరావు,ఎస్ హరీష్,దేవరాజ్,ఎస్.కె జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన బిఆర్ఎస్ నాయకులు

**సూర్య, రాజన్న సిరిసిల్ల**



సిరిసిల్ల పట్టణ పురపాలక సంఘం నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఖదీర్ పాషను సోమవారం బిఆర్ఎస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి నేతృత్వంలోని బిఆర్ఎస్ నాయకుల బృందం కమిషనర్ కలిసి సిరిసిల్ల పట్టణంలోని పరిస్థితులపై చర్చించారు. శానిటేషన్ మెరుగుపరచడంతో పాటు 101 రూపాయికే అంత్యక్రియల పథకాన్ని కొనసాగించాలని కోరారు. కమిషనర్ను కలిసిన వారిలో బిఆర్ఎస్ పట్టణ కార్యదర్శి మ్యానరవి, మాజీ వైస్ చైర్మన్ మంచే శ్రీనివాస్, అర్బన్ బ్యాంకు చైర్మన్ రాపల్లి లక్ష్మీ నారాయణ,అడ్డగట్ల మురళి, గడ్డం లత భాస్కర్, కల్లూరి రాజు, కల్లూరి మధు, బత్తుల రమేష్, బింగి రామాంజనేయులు, గడ్డం భగవాన్ ఉన్నారు.

## జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన సంకెపెల్లి జాహ్నవికి సత్కారం

**సూర్య, వేములవాడ**

వేములవాడ పట్టణం నుండి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన సంకెపల్లి జాహ్నవికి వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానం చేశారు. దీనికి ముఖ్యఅతిథిగా సీనియర్ సివిల్ జడ్జ్ అనిల్ జాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జ్ అనిల్ జాదవ్ మాట్లాడుతూ వేములవాడ బార్ అసోసియేషన్ నుండి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వేములవాడ బార్ అసోసియేషన్ నుండి ఎన్నికైనందుకు మీ అందరి ముఖాల్లో ఆనందం కనిపిస్తుందని, ఇలాగే ఆసక్తి ఉన్న జూనియర్, సీనియర్ న్యాయవాదులకు మీ బార్ అసోసియేషన్ నుండి సహాయ సహకారాలు అందించాలని అన్నారు.



న్యాయవాదులకు ఎలాంటి సందేహాలు సలహాలు కావాలన్నా భయపడకుండా సంప్రదిస్తే తగిన సలహాలు సూచనలు ఇస్తానన్నారు. జాహ్నవిని ఆదర్శంగా తీసుకొని బాగా ప్రిపేర్ అయి జడ్జిలుగా, పీపీలుగా ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బారాసోసియేషన్ ప్రెసిడెంట్ గుండా రవి, ఉపాధ్యక్షులు జనార్ధన్, కార్యదర్శి గడ్డం సత్యనారాయణ రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

## రాజన్న సేవలో కేంద్ర మంత్రి బండి సంజయ్ సతీమణి

**సూర్య, వేములవాడ**



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ సతీమణి అపర్ణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోడెమొక్కులు చెల్లించిన అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. నాగిరెడ్డి మండపంలో వేద పండితులు ఆమెకు వేద ఆశీర్వచనాలు అందించారు. ఆలయ ఏఈఓ బ్రహ్మన్నగారి శ్రీనివాస్ స్వామివారి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రోటోకాల్ ఏఈఓ జి.అశోక్ కుమార్, ఇన్స్పెక్టర్ ఎన్.రాజేందర్, గొట్టం గిరి, ఆలయ సిబ్బంది ఉన్నారు.

## ఘనంగా మొహర్రం వేడుకలు

**- గంభీరావుపేటలో పీర్ల ఊరేగింపు**

**సూర్య, గంభీరావుపేట**



గంభీరావుపేట మండల కేంద్రంలో సోమవారం భక్తి శ్రద్ధలతో మొహర్రం వేడుకలు నిర్వహించారు. డప్పు చప్పుల్ల మధ్య పీరీలను ఊరేగించారు. కుల మతాలకు అతీతంగా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రంతో పాటు పలువురు నాయకులు, నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నాన్ టీచింగ్ అభ్యర్థులకు కే.జి.బి.వి/ఆదర్శ పాఠశాలల ఇంటర్వ్యూలు పూర్తి

**- మండల విద్యాధికారి ఎన్. శ్రావణ్ కుమార్**

**సూర్య, బోయినపల్లి**



మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నాన్ టీచింగ్ పోస్టు హెడ్ కుక్-1 ఆదర్శ పాఠశాలలో నాన్ టీచింగ్ అసిస్టెంట్ కుక్ - 2 గల వాటికి మండలం లోని మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు తేది 25.06. 2025 నుండి 27.06.2025 (03) దరఖాస్తులు స్వీకరించగా గడువు తేది లోపల 10 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తేది 07.07. 2025 సోమవారం రోజున మండల విద్యాధికారి కార్యాలయం బోయినపల్లిలో త్రిమెన్ కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూ నిర్వహించనైనది. ఇట్టి ఇంటర్వ్యూకి 10 మంది దరఖాస్తు చేసుకోగా (08) మంది మాత్రమే హాజరు కావడం జరిగింది. ఇట్టి ఇంటర్వ్యూలో తహసీల్దార్ నారాయణ రెడ్డి, ఎంపీడీవో బీమా జయశీల ఆధ్వర్యంలో జరిగినవి. దరఖాస్తు దారుల ను విడి విడిగా పలు ప్రశ్నలు వేయడం జరిగింది. త్రిమెన్ కమిటీ వారు వారి అభిప్రాయం మేరకు మార్కులు వేసి ఎంపిక ప్రక్రియ నిమిత్తం జిల్లాకు పంపించడం జరుగుతుందని మండల విద్యాధికారి ఎన్. శ్రావణ్ కుమార్ తెలిపారు.

## మధ్య మానేరు నుండి కుడి కాలువ ద్వారా తోటపల్లికి నీరు విడుదల చేయాలి

**- తహసీల్దార్‌కు వినతి**

**సూర్య, ఇల్లంతకుంట**

మిడ్ మానేరు నుండి కుడి కాలువ ద్వారా బెజ్జంకి మండలం తోటపల్లి ప్రాజెక్టు కు నీరు విడుదల చేయాలని ఇల్లంతకుంట తహసీల్దార్ ఫారుఖ్ కు వినతిపత్రంను సోమవారం అందజేశారు.ఈ కాలువ ద్వారా నీరు విడుదల చేస్తేవల్లంపట్ల,వంతడ్పుల,కిష్టారావుపల్లి,రంగపేట,గాలిపల్లి గ్రామాల రైతులు కలిసి వినతిపత్రంలో నార్లు ముదిరిపోతున్నాయని వెంటనే నీళ్లు విడుదల చేయాలని కోరారు.నీటిని విడుదల చేయని పక్షంలో వంతడ్పుల వంతెనపై పెద్దఎత్తున ధర్నా చేపడుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కేవియన్ రెడ్డి,రవిందర్ రెడ్డి,కరుణాకర్ రెడ్డి,పండుగ బాస్కర్,పెంటల నరేష్,శ్రీనివాస్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

జగిత్యాల

మంగళవారం 8 జూలై 2025 4


### అధికారులు సమన్వయంతో పని చేస్తూ

# రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

### - జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లాలో జరుగు రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ లత ఆధ్వర్యంలో సోమవారం జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించినారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతోంది అన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా స్థాయిలో ఒక ఇన్స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో డిస్ట్రిక్ ట్రాఫిక్ అనాలసిస్ బ్యూరోని ప్రారంభించి ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటు రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణ తగు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు పూర్తిగా నివారించాల్సిన అవసరం ఉందని అందులో భాగంగా జాతీయ రహదారిపై ఉన్న అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదే విధంగా హైవేలపై జరిగే యాక్సిడెంట్లకు సంబంధించి ఫస్ట్ రెస్పాండర్స్‌గా ఉండేందుకు హైవేలపై ఉన్న పెట్రోల్ బంక్ వారికి, ధాబాలో పనిచేసే వారికి, యూత్, విలేజ్‌కి ఫస్ట్ ఎయిడ్, సిపిఆర్‌పై అవగాహన కలిగించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఉన్న 43 బ్లాక్ స్పాట్స్ (ప్రమాదాలు అధికముగా జరుగు ప్రదేశాలు) ను పంచాయతీరాజ్ ఆర్ & బి ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రమాదాల నివరణపై దృష్టి సారించాలని అన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బిఎస్ లత మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల కారణంగా ఏ ఒక్కరూ వైకల్యం బారిన పడకుండా, ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు లేకుండా రహదారి ప్రమాదాలు సంభవించకుండా రోడ్డు భద్రతా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రోడ్డు కండిషన్‌లో లేకపోవడం, సైనేజ్ బోర్డులు,అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల అక్కడక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సంబంధిత ఇంజనీరింగ్ శాఖలు అలాంటి ప్రదేశాలను గుర్తించి వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు డిఎస్పీలు, మున్సిపల్ అధికారులు, పంచాయతీ అధికారులు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ జారీ చేసిన పని గంటల పెంపు

### - జివో కాఫీని దహనం చేసిన సిఐటియు నాయకులు

**సూర్య జగిత్యాల అర్బన్**



కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ దుకాణాలు స్థాపనల చట్టం, 1988లోని సెక్షన్ 16,17కి సవరణ చేస్తూ 8 గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతూ జులై 5న జి.వో.282 విడుదల చేసిన జివోను రద్దు చేయాలని సీఐటియూ జగిత్యాల జిల్లా కో-కన్వీనర్ కోమటి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జివో కాఫీని దహనం చెయడం జరిగింది. అనంతరం కోమటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ జి.వో పెట్టుబడిదారులు, కార్పోరేట్ల సంస్థల ప్రయోజనాలు, లాభాల కోసమే అన్నారు. ఈ జి.వో అమల్లైతే కార్మికులు తీవ్ర శ్రమదోపిడికి గురౌతారు. దీని రద్దుకై రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుటాలని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా జిల్లా కార్యాలయం వద్ద ప్రభుత్వం జారీ చేసిన ఆ జి.వోను కాపీలను దహనం చేసి, నిరసనలు తెలిపారు. కాసం అన్వేష్, శతరాషి హరిష్, నారాయణ, రాజశేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థికి హెల్ప్ లైన్ నెంబర్లపై అవగాహన ఉండాలి

### - స్టూడెంట్స్ కౌన్సిలర్ డా. పి. తిరుపతి

**సూర్య,కొడిమ్యాల**



కొడిమ్యాల మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ బోర్డ్ కార్యదర్శి ఆదేశాల మేరకు సోమవారం రోజున కళాశాల ప్రిన్సిపాల్ కె.వేణు అధ్యక్షతన 'సామాజిక రుగ్మతలపై' అవగాహన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ప్రధాన వక్త స్టూడెంట్స్ కౌన్సిలర్ డా.పి.తిరుపతి విద్యార్థులకు ఆధునిక సామాజిక రుగ్మతలైన మానవ అక్రమ రవాణా, డ్రగ్స్ దుర్వినియోగం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్టూడెంట్స్ కౌన్సిలర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా పట్ల, సైబర్ నేరాల పట్ల, మత్తు పదార్థాల పట్ల, ఫేక్ సోషల్ మీడియా ప్రకటనల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, వాటి బారిన పడినప్పుడు 1908,100,1098, 112,1930 వంటి పలు హెల్ప్ లైన్ నెంబర్లకు ఫోన్ చేసి రక్షణ పొందాలని సూచించారు. విద్యార్థులు హెల్ప్ లైన్ నెంబర్లపై తమ కుటుంబ సభ్యులకు, బంధువులకు, చుటుపక్కల వారికి అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు,కళాశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 39 ధరఖాస్తులు

**సూర్య జగిత్యాల ప్రతినిధి**




ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 39 పిర్యాదులు, వినతులను స్వయంగా స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రెవెన్యూ డివిషనల్ అధికారి మధుసూదన్, మెట్పల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్, వివిధ జిల్లా అధికారులు, తహసీల్దర్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి

**సూర్య ఎండపల్లి**



మండలంలో పలు బాధిత కుటుంబాలను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సోమవారం పరామర్శించారు మండల కేంద్రానికి చెందిన సాయిని నారాయణరావు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. మాజీ మంత్రి వెంట మండల పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిఎంఆర్ చెక్కు అందజేత

**సూర్య రాయికల్**



మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన అర్కుటి లక్ష్మికి మాజీ మంత్రి జీవన్ రెడ్డి చొరవతో మంజూరైన రూ.56000 విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గ్రామ కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధి దారులు, నాయకులు జీవన్ రెడ్డికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు గుజ్జుల మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, మాజీ ఉప సర్పంచ్ హరీష్ రావు, నాయకులు రాజేశ్వర్ రావు, ఏ.గంగారెడ్డి, డి.గంగారెడ్డి, ఆనంద్ రెడ్డి, శేఖర్ రెడ్డి, సుదీర్ రెడ్డి, కోల రాజు, గంగ నరసయ్య, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## కొండాపూర్‌లో పరామర్శించిన బండి

**సూర్య మేడిపల్లి**



మండలంలోని కొండాపూర్ గ్రామంలో గ్రామ బిజెపి బూత్ ప్రెసిడెంట్ చందా రమేష్ తండ్రి చిన్న గంగారం ఇటీవలే అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబాన్ని సోమవారం రోజు కేంద్ర హోం సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో తన వెంట వేములవాడ నియోజకవర్గం ఇన్చార్జి వికాస్ రావు పార్లమెంట్ కన్వీనర్ క్యాతం దశరథ రెడ్డి, మంజ శ్రీనివాస్, కరంద్ల మధుకర్, ఎస్ ఎన్ రెడ్డి, గ్రామ మాజీ ఎంపీటీసీ మేకల రాజు, వడ్డగట్ల గణేష్, పల్లె రాజేష్‌లు పాల్గొన్నారు.

## ఒక మార్పు అభివృద్ధికి మలుపులో భాగంగా స్కూల్ విద్యార్థులు డి.ఆర్.సి.సి సందర్శన

**సూర్య కోరుట్ల టౌన్**



కోరుట్ల పుర పాలక సంఘం ఆధ్వర్యంలో సోమవారం నలంద స్కూల్ విద్యార్థులను కోరుట్ల మున్సిపల్ పరిధిలోని డి.ఆర్.సి.సి(డ్రై రీసోర్స్ కలెక్షన్) సెంటర్‌ని సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు తడి చెత్త,పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని తెలియజేస్తూ తడి చెత్త నుండి ఎరువుల తయారీ గురించి మరియు పొడి చెత్తను డి.ఆర్.సి.సిలో ఏ విధంగా వేరు చేస్తారు పొడి చెత్తను రీసైక్లింగ్ కు ఏ విధంగా పంపిస్తారు అనే విషయంపైన మున్సిపల్ కమిషనర్ రవీందర్ అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మహేష్, టీ.ఎం.సి శ్రీరామ్, మెప్మా సిబ్బంది జక్కోద్దీన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## పిరిల ఉరేగింపు, మొహరం మటికీల వేడుక

**సూర్య ఇబ్రహీంపట్నం**



మండలంలో మొహరం వేడుకల్లో భాగంగా సోమవారం మటికీలను భక్తులు తీశారు. ఇబ్రహింపట్నం మండల కేంద్రంతో పాటు బర్దిపూర్, గోదూర్,వర్షకొండ,అమ్మకపెట్ తదితర గ్రామాల్లో భక్తులు మట్టికిలను తీశారు. ముందుగా కొత్త చిన్న కుండలను తీసుకువచ్చి వాటిని శుభ్రంగా కడిగి దానికి పూలతో గంధం తో అలంకరించి ఇంట్లో బెల్లం పానకం తీసి ఆ మట్టికిలో పోసి దప్పు చప్పుల మధ్య స్థానిక మసీదులకు తీసుకువెళ్లి పీరీల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి పిరిలకు సమర్పించారు. తొమ్మిదో రోజు ఈ మట్టికిల పానకం చేయడం జరుగుతుంది. అలాగే పదవ రోజైన షహదత్ అనగా పెద్ద సరిగతి వేడుకలు జరిగాయి దీంతో మొహరం వేడుకలు ముగింపు జరుగుతుంది. ఈసందర్భంగా బర్దిపూర్ గ్రామంలో సోంతి మోహన్ యెగి కర్నల్ ట్రస్టు అధ్వర్యం పిరిల ఉరేగింపు పెద్దయెత్తున్న పులి వేశాల మధ్య సాగింది. గ్రామస్తులు, భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి

# 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## - జెండా ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**సూర్య, వేములవాడ**



వేములవాడ నియోజకవర్గ కేంద్రంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 31వ ఆవిర్భావ దినోత్సవం, పద్మశ్రీ మందకృష్ణ 60వ పుట్టినరోజు వేడుకలు సోమవారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వేములవాడ మండల అధ్యక్షులు జింక శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై, జెండా ఆవిష్కరణ చేశారు. మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ గత 30 సంవత్సరాలుగా జాతి కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నార న్నారు. ఆరోగ్యశ్రీ, వితంతు, వృద్ధాప్య పెన్షన్లు, వికలాంగుల పెన్షన్ల కోసం పోరాడుతూ అట్టి పథకాలకు ఆద్యం పోసిన వ్యక్తి మందకృష్ణ మాదిగ అని, ఈ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుప్రీం కోర్టు తీర్పు అనంతరం ఎస్సీ వర్గీకరణ గురించి అసెంబ్లీలో వారు నిర్ణయం తీసుకోవడం, దానికి సభ్యులమంతా ఆమోదం తెలపడం, మొట్టమొదట తెలంగాణ రాష్ట్రంలోనే అమలు చేయడం శుభసూచకం అని, మాదిగలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని అన్నారు. మందకృష్ణ పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరు తీసుకొని ముందుకు పోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్చార్జ్ పుట్ట రవి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఆవునూరు ప్రభాకర్, ఎమ్మెస్పి జిల్లా అధ్యక్షులు ఖానాపురం లక్ష్మణ్, కోనరావుపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, బొడ్డు రామన్న, ఎనిగంటి గసకంటి ప్రభాకర్, రాజన్న సిరిసిల్ల జిల్లా అంబేద్కర్ సంఘాల అధ్యక్షులు కత్తెర దేవదాసు, గుడిసె మనోజ్, ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి దోమకొండ మహేందర్, బొడ్డు నారాయణ, రాజన్న సిరిసిల్ల జిల్లా బహుజన సేన వ్యవస్థాపకులు జింక శ్రీధర్, గుడిసె సదానందం, నూకలమర్రి గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు దొంతుల సంజీవ్, సామల ప్రతాప్, జింక నాగరాజు తాళ్లపల్లి నాగరాజు, కుల బాంధవులు పాల్గొన్నారు.

# దయచేసి మా భూముల జోలికి రావద్దు

## - మేడిపల్లి రైతులు

**సూర్య సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రామగిరి ఖిల్లా మేడిపల్లి శివారులోని భూములను ప్రభుత్వానికి ఇవ్వమని రైతులు తేల్చి చెప్పారు. ఈ మేరకు సోమవారం మంథని ఆర్డీవో కాసబోయిన సురేష్‌కు రైతులు వినతిపత్రం అందించారు. మా భూముల జోలికొస్తే ఖబడ్దార్ ప్రభుత్వానికి రైతుల హెచ్చరిక చేశారు. ఎద్దేడిసిన వ్యవసాయం రైతేసిన రాజ్యం బాగుపడదని నినాదాలు చేశారు. స్వప్రయోజనం కోసం ప్రభుత్వాన్ని తప్పు తోవ పట్టిస్తున్న లోకల్ లీడర్లని ఆరోపించారు. ఈ చర్యను సమర్థిస్తున్న వారికి తగిన గుణపాఠం చెప్తామని-రైతులు అన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పరిశ్రమల పేరుతో మా భూములను లాక్కొని మా బ్రతుకులను రోడ్డుపాలు చేయొద్దని మేడిపల్లి రైతులందరూ కలిసి సోమవారం ఆర్డీఓ గారికి తమ గోడు వెళ్లబుచ్చారు. ప్రజాపాలన అని చెప్పుకుంటున్న ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతే రాజు అను ప్రసంగాలు చేసుకుంటూ మేడిపల్లి రైతులను కూలీలుగా మార్చే ప్రయత్నం చేస్తుందని ఇది సరైన పద్ధతి కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.. ఎద్దేడిచిన వ్యవసాయం రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదని ఈ చర్యను ఉపసంహరించకపోతే ఎంతటి త్యాగాలకైనా సిద్ధమని రైతులన్నారు. అభివృద్ధి పేరుతో పరిశ్రమలు అనే పేరుతో రైతులను మోసం చేస్తే ఊరుకోమన్నారు. కొంతమంది లోకల్ లీడర్లు తమ స్వప్రయోజనం కోసం ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని వారికి తగిన గుణపాఠం చెబుతామని రైతులన్నారు. గతంలో కూడా అభివృద్ధి పేరుతో రత్నాపూర్ మరియు మేడిపల్లి భూములను సింగరేణి సుమారు 400 ఎకరాలు అలాగే కృషి విజ్ఞాన కేంద్రం పేరుతో సుమారు 170 ఎకరాలు ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం లాక్కుందని రైతులు చెప్పుకొచ్చారు. అభివృద్ధి అంటే మంథని నియోజకవర్గంలో రత్నాపూర్ తప్ప వేరే ప్రాంతాలు గుర్తుకు రావడం లేదని ప్రశ్నించారు. మాకు లేని అభివృద్ధి వద్దని ఉన్న భూములు వదులుకోమన్నారు. మంథని నియోజకవర్గంలో అభివృద్ధి లేక చాలా మండలాలు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నాయని ప్రభుత్వం ఆయా మండలాలపై దృష్టి సారించాలని చెప్పుకొచ్చారు. మేడిపల్లి భూముల జోలికి వస్తే ఖబర్దార్ అని రైతులు హెచ్చరించారు. ఈ సందర్భంలో మేడిపల్లి రైతులు, మహిళా రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర ఆలయంలో ఘనంగా గోరింటాకు మహోత్సవం

**సూర్య, చొప్పదండి**



పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర మణికంఠ ఆలయంలో ఆషాడ మాసం పురస్కరించుకొని శ్రీ వెంకటేశ్వర మణికంఠ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప సేవా సమితి మహిళా సభ్యులు ఘనంగా గోరింటాకు పూజ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బొడిగె వెంకటేష్ మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాల నుండి ఎంతో వైభవంగా గోరింటాకు పండగ ఉత్సవాలను మహిళా సభ్యులు శ్రీ వెంకటేశ్వర మణికంఠ ఆలయంలో నిర్వహించడం అభినందనీయం అన్నారు. గోరింటాకు పూజ మహోత్సవంలో పాల్గొన్న మహిళా సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. హనుమాన్ భజ మండలి సభ్యులు భజన సంకీర్తనలతో ఆకట్టుకున్నారు. అనంతరం అన్న ప్రసాదం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు గొల్లపల్లి శ్రవణ్ కుమార్, వైస్ చైర్మన్ బొడిగె వెంకన్న, ఎలిగేటి రామ లక్ష్మణ్, క్యాషియర్ దండె సత్యానంద్, పిట్టల సత్యం,మునిసిపల్ మాజీ చైర్ పర్సన్ గుర్రం నీరజ, మాజీ కౌన్సిలర్లు నలు మాచు జ్యోతి-రామకృష్ణ, దండ జమున, కొత్తూరు స్వతంత్ర భారతి, దండెరమ, దండ రాజయ్య, చీకట్ల లచ్చయ్య, గోపాల్ రెడ్డి, లక్ష్మణ్, బండారి వీరమల్లు, మహేష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్‌లో ఘనంగా బోనాల జాతర వేడుకలు

**సూర్య, హుజురాబాద్**

తెలంగాణ ప్రాంతంలో ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే బోనాల పండుగ వేడుకలు సోమవారం హుజురాబాద్ పట్టణంలోని ఆల్ఫోర్స్ జీనియస్ స్కూల్‌లో విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అధినేత, వి఼ఎన్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ రాష్ట్రానికి గొప్ప ప్రతీక అని, మతసామరస్యానికి నాంది పలికిన విశిష్ట వేడుకలని అన్నారు. బోనాలు మన సంస్కృతికి చిహ్నాలని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను పిల్లలకు రేపటి తరానికి తెలియజేయడం కోసం పాఠశాలలో ఈ వేడుకలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. పాఠశాల ఆవరణలో అందంగా అలంకరించినటువంటి అమ్మవారి విగ్రహం వద్ద జ్యోతిని వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు ప్రదర్శించిన అమ్మవారి నృత్యాలు, పోతురాజు వేష దారణలు అందరిని అలరించాయి. విద్యార్థులు ప్రదేశించినటువంటి గ్రామదేవతల వైభవం నృత్య ప్రదర్శన ఆలోచింపజేసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## చెరువులపై ఆధార పడిన గ్రామస్తులకు న్యాయం చేయాలని కలెక్టర్‌కి వినతి

**సూర్య,రాయికల్**



గ్రామంలోని చెరువులపై ఆధారపడి జీవిస్తున్న గిరిజన, ఇతర కులాలకు చెందిన గ్రామస్తులకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కి ధర్మాజీపేట గ్రామస్తులం వినతిపత్రం అందజేసినట్లు గ్రామ నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని లక్కం కుంట,మల్లయ్య కుంట అనే చెరువులను గ్రామస్తుల తీర్మానం లేకుండా ఒక వర్గం కు మాత్రమే సొసైటీ పేరిట రిజిస్టర్ చేయడం అధికారుల తప్పిదమని,గ్రామ సభ నిర్వహించకుండా తప్పుడు తీర్మానం అందించి ఒకే వర్గంపై చెరువులను రిజిస్టర్ చేయడం జరిగిందని ఇట్టి విషయంపై జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ జరిపి,గ్రామస్తులకు న్యాయం చేయాలని,తప్పుడు తీర్మానం అందించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు గ్రామ నాయకులు తెలిపారు. గ్రామంలో ఇట్టి చెరువులపై ఆధారపడి గిరిజనులు,బిసి,ఎస్సి కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నారని, కానీ గ్రామస్తుల తీర్మానం లేకుండా ఒక వర్గానికి మాత్రమే అట్టి చెరువులను రిజిస్టర్ చేయడం సబబు కాదని,ఇట్టి విషయమై వెంటనే విచారణ జరిపించి గ్రామస్తులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ కోరినట్లు గ్రామ నాయకులు తెలిపారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**సూర్య మల్యాల**




ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సందర్భంగా మండలంలోని మానాల గ్రామంలో సోమవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు నలువాల సంజీవ్ జెండా ఆవిష్కరించారు. అలాగే మల్యాల ఎక్స్ రోడ్ వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు జెండా ఎగరవేశారు. మండలంలోని పలు గ్రామాలలో ఎమ్మార్పీఎస్ నాయకులు జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు మోత్కుల నర్సయ్య, ప్రధాన కార్యదర్శి గుడిచే రవి, అంబేద్కర్ సంఘ నాయకులు, మల్యాల ఈశ్వర్, తోడేటి బాబు, పూడూరి స్వామి, శంకర్ తదితరులు పాల్గొన్నారు

## గ్రీవెన్స్ డే ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**సూర్య జగిత్యాల**



ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డేలో బాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 11 మంది అర్జీదారుల ఫిర్యాదులను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పరిశీలించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు.

## సహకార సంఘాలపై అవగాహన సదస్సు

**సూర్య, హుజురాబాద్ రూరల్**



సహకార సంఘాలపై హుజురాబాద్ మండలం చెల్పూర్ జిల్లా పరిషత్ సెకండరి పాఠశాలలో సోమవారం జూపాక సింగిల్ విండో ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని సహకార సంఘాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా గ్రామీణ ఆర్థికాభివృద్ధిలో సహకార సంఘాల పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సహకార అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్ కుమార్, హుజురాబాద్ ఎంఈఓ భూపతి శ్రీనివాస్, ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, ఉపాధ్యాయులు పవన్, కార్యదర్శి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డల కోసం ఆలోచించిన ఏకైక సీఎం కేసీఆర్

## - పేదలకు మేలు కోసం జైలుకు సైతం వెళ్లేందుకు సిద్ధం
## - హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**సూర్య, హుజురాబాద్**

భారతదేశంలోనే ఆడబిడ్డల కోసం ఆలోచించి కేసీఆర్ కిట్ వంటి అద్భుతమైన పథకాలు అందించిన ఏకైక సిఎం కేసీఆర్ అని, పేద ప్రజలకు లాభం జరుగుతుందంటే తను జైలుకు వెళ్లేందుకు సిద్ధమని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. హుజురాబాద్ పట్టణంలోని కేసి క్యాంపులో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కమలాపూర్ మండలానికి చెందిన దాదాపు 100 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టకపోయినా కళ్యాణలక్ష్మీ ద్వారా పేదింటి ఆడబిడ్డలకు కేసీఆర్ మేనమామలా సాయం అందించారని అన్నారు. రూ. 50వేల నుంచి మొదలు పెట్టి లక్ష రూపాయలకు పెంచారని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే పథకాలు అందడం లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు పెడుతుందని, జైలుకు పంపాలని చూస్తుందన్నారు. కేసీఆర్ కిట్ నిలిపివేయడంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీలు గణనీయంగా తగ్గాయని




అన్నారు. పథకం పేరు మార్చైనా సరే పథకాన్ని అమలు చేయాలన్నారు. ఆనాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ఆర్ ప్రవేశ పెట్టిన ఆరోగ్య శ్రీ పథకం నిరుపేదలకు ఎంతో మేలు చేస్తుందని, రాజకీయాలకు తావివ్వకుండా పథకాన్ని గత బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు పరిచిందన్నారు. కనీసం పేరును సైతం మార్చలేదన్నారు. గతంలో తీసుకున్న రెండు మూడు సిమెంట్ బస్తాల బూచిని చూపెట్టి పేదలకు ఇందిరమ్మ ఇండ్లను దూరం చెయ్యడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. అటువంటి వారికి ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వాలని అన్నారు. అలాగే, రైతులకు అందించే యూరియాను అందుబాటులో ఉంచాలని సూచించారు. బనకచర్ల ప్రాజెక్టుతో మన నీళ్లను ఆంధ్రకు తరలించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రైతులకు నీళ్లివ్వకుండా ఆంధ్రకు తరలిస్తే ఊరుకునేది లేదన్నారు. ఇటీవల వచ్చిన పత్రికా కథనాలపై స్పందిస్తూ.. తెలంగాణ బీఆర్ఎస్ పార్టీ జాగీరేనని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల మనస్సుల్లో నాటుకు పోయిన జాగీరని, తెలంగాణ ప్రజలకోసం పోరాడే పార్టీ బిఆర్ఎస్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు తక్కళ్లపల్లి సత్యనారాయణ రావు, మాజీ జెడ్పిటీసీలు నవీన్, ఇంద్రసేనా రెడ్డి, కేడీసీసీ డైరెక్టర్లు కృష్ణప్రసాద్, రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే గ్రామాలలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా సోమవారం హుజురాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లి, కందుగుల, ధర్మరాజుపల్లి, కనుకులగిద్ద, జూపాక, చెల్పూర్, శాలపల్లి, ఇందిరానగర్, రాజపల్లి, రంగాపూర్, రాంపూర్, సిర్సపల్లి, వెంకట్రావ్ పల్లి, పోతిరెడ్డి పేట, సింగాపూర్ గ్రామాలలో 31 మంది లబ్ధిదారులకు రూ. 7,88,500 విలువ గల సిఎంఆర్ఎఫ్ చెక్కులను ప్రతి లబ్ధిదారుని ఇంటికి వెళ్లి హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పంపిణీ చేశారు.

## బిజెపి కొత్తపల్లి జోన ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతి

**సూర్య కొత్తపల్లి**

భారతీయ జనతా పార్టీ కొత్తపల్లి జోన్ అధ్యక్షులు ముత్తునూరి హరీష్ ఆధ్వర్యంలో కరీంనగర్ కార్పొరేషన్ లో విలీనమైన కొత్తపల్లి పట్టణం పరిధిలోని ప్రజా సమస్యలుపై వినతి పత్రం అందజేశారు. కొత్తపల్లిలోని వివిధ వాడల్లో ఏర్పడ్డ మురుగు కాలువలు గుంతల రోడ్లు అంతేకాకుండా దోమలు పందులు కుక్కలతో ప్రజలు పడే బాధలు గురించి మరియు సమస్యలపై భారతీయ జనతా పార్టీ కొత్త పెల్లి జోన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి జోన్ అధ్యక్షుడు ముతునూరి హరీష్ మాజీ అధ్యక్షుడు కేంచ శేఖర్, జిల్లా ఎస్సి మోర్చా కార్యదర్శి ఎర్రోళ్ల ప్రదీప్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి కొప్పుల హరిప్రసాద్, మండల సేనా రెడ్డి, వేముల శివకుమార్, అర్చనపల్లి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## పోయినది

సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా పేరు మొహమ్మద్ షరీఫ్, తండ్రి పేరు: అంకుస్ అను నేను ఇ.నెం. 4-4-117, రాజీవ్‌నగర్, పెద్దపల్లి టౌన్, పెద్దపల్లి జిల్లా ప్రాంతంలో నివాసం ఉంటున్నాను. తేదీ 02/07/2025 రోజున పెద్దపల్లి కామన్ నుండి పెద్దపల్లి బస్ స్టాండ్ వరకు ప్రయాణిస్తున్న సందర్భంలో Y9634233 నెంబర్ గల నా యొక్క పాస్ పోర్టు ఎక్కడనో పడి పోయింది. కావున పైన పేర్కొన్న నా యొక్క పాస్ పోర్టు ఎవరికైనా దొరికితే ఈ క్రింద పేర్కొన్న నా అడ్రస్‌లో ఇవ్వగలరు.

**మొహమ్మద్ షరీఫ్**
**ఇ.నెం.4-4-117,**
**రాజీవ్‌నగర్, పెద్దపల్లి టౌన్,**
**మం.జిల్లా.పెద్దపల్లి**
**ఫోన్. నెం. 80744 01041**

## గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైములతో సూర్య దినపత్రికకు ఏ విధమయిన సంబంధం లేదు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## మొక్కలు నాటిన కాంగ్రెస్ నాయకులు

**సూర్య కరీంనగర్ టౌన్**



వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పాత 29 కొత్త 55 వ డివిజన్‌లో యూత్ కాంగ్రెస్ మాజీ అసెంబ్లీ అధ్యక్షుడు మహమ్మద్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో బొమ్మకల్ టు పాత బజార్ శివాలయం రోడ్డులో పలుచోట్ల మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుని బాధ్యత అని వర్షాకాలంలో మొక్కలు నాటడం ద్వారా సకాలానికి వర్షాలు పడి సమస్త జీవజాతికి మేలు జరుగుతుందని నేతలు పేర్కొన్నారు. ఇమ్రాన్‌తో పాటు సిటీ కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు అహ్మద్ అలీ, వసీం, ఆసీఫ్, రాము, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**- చిగురు మామిడి ఎస్సై ఆర్ సాయికృష్ణ**

**సూర్య చిగురు మామిడి**




చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామం సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను చిగురుమామిడి పోలీసులు తనిఖీ చేస్తున్న క్రమంలో ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఎస్ఐ ఆర్ సాయి కృష్ణ జరిపిన తనిఖీల్లో ట్రాక్టర్‌ను నిలిపివేసి, అవసరమైన పత్రాలు లేనందున ఘటనపై కేసు నమోదు చేసి అనంతరం ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించ్చి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు సహకరించాలని చిగురు మామిడి ఎస్ఐ ఆర్ సాయికృష్ణ కోరారు.

## పద్మ శ్రీ మంద కృష్ణ జన్మదిన సందర్బంగా రక్త దానం

**సూర్య కరీంనగర్**



పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ 60వ జన్మదిన సందర్భంగా కరీంనగర్‌లో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో మహిళ విభాగం కరీంనగర్ జిల్లా ఎంఎంఎస్ జిల్లా కన్వీనర్ దండు వరలక్ష్మి మాదిగ,కరీంనగర్ మహిళ విభాగం ఎంఆర్‌పిఎస్ జిల్లా కో కన్వీనర్ బుద్దుల వాణి రక్తం దానం చేసి మంద కృష్ణ మాదిగ మీద వున్నా అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల సేమియా, చిన్నపిల్లలు గర్భిణీ స్త్రీల కోసం రక్తదానం చేసేందుకు ముందుకు ప్రతి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బెజ్జంకి అనిల్ మాదిగ, కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంద రాజు, కో ఇంచార్జి కొమ్మ శేఖర్ కరీంనగర్ అధికార ప్రతినిధి దండు అంజయ్య మాదిగ,బుద్దుల జోషి,మెగా బ్లడ్ డోనర్ గాలిపెల్లి కుమార్ పాల్గొని రక్తం దానం చేసిన మహిళలను అభినందించారు.

## సెక్సువల్ మసాజ్ పేరుతో మోసం

**- ముగ్గురు అరెస్ట్, పరారీలో ఒకరు**

**సూర్య కరీంనగర్**



కరీంనగర్ జిల్లాలో సెక్సువల్ మసాజ్ పేరుతో ఓ యువకుడిని ట్రాప్ చేసి డబ్బులు దోచిన కేసులో ముగ్గురు నిందితులను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్‌కు చెందిన పిపావత్ నాగేశ్ అనే యువకుడు డేటింగ్ యాప్ "గ్రైండర్" ద్వారా మసాజ్ సేవలు అందిస్తున్నాడు. జూలై 4న ఒక వ్యక్తి పిలుపు మేరకు నగేశ్ ఎఫ్.ఎం.స్టేషన్ సమీపానికి వెళ్లగా, ముగ్గురు వ్యక్తులు అతనిపై దాడి చేసి, రూ.17,000 నగదు, వాచ్ దోచుకున్నారు. ఫిర్యాదు అందుకున్న రూరల్ పోలీసులు టెక్నికల్ ఆధారాలతో విచారణ జరిపి, విజయనగర్‌కు చెందిన ముస్తాఫా ఏ ఇమ్రాన్, మహ్మద్ అమీర్, సాదాబ్‌లను అరెస్ట్ చేసి రూ.14,000 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు బషీర్ పరారీలో ఉన్నాడు. డేటింగ్, మసాజ్ యాప్‌ల ద్వారా మోసపూరిత కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద ఘటనలు వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి, ఎస్సై లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

## ముదిరాజ్ మహిళ కో-ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు

**సూర్య గన్నేరువరం**



అన్ని రంగాలలో మహిళలు దూసుకు వస్తున్నటువంటి తరుణంలో మత్స్యకార వృత్తిలో కూడా వారిని భాగస్వాములు చేయాలనేటువంటి సదుద్దేశంతో గుణుకుల కొండాపూర్ గ్రామంలో ముదిరాజ్ మహిళా మత్స్యకార కోపరేటివ్ సొసైటీ రిజిస్టర్ నెంబర్ (k687)ని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. మహిళలు మాట్లాడుతూ త్వరితగతిన సొసైటీ ఏర్పాటు కొరకు కృషి చేసినటువంటి కరీంనగర్ జిల్లా మత్స్యశాఖ డిఎఫ్ఓ విజయభారతి, సూపర్ ఇండెంట్ వెంకటేశ్వర్లు, ఎఫ్‌డిఓ మంజులకి శాలువా కప్పి సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. మహిళ సొసైటీకి సహాయ సహకారాలు అందించాలని కోరారు. అలాగే మహిళా సొసైటీకి సహాయ సహకారాన్ని అందించినటువంటి జిల్లా ఫిషరీస్ చైర్మన్ పిట్టల రవీందర్ ముదిరాజ్, వైస్ చైర్మన్ పెసర కుమారస్వామి ముదిరాజ్‌కి ధన్యవాదాలు తెలియజేశారు.

## దుర్గాభవానీ అమ్మవారికి గోరుచిక్కుడు కాయల మాలల అలంకరణ

**సూర్య కరీంనగర్**



కరీంనగర్ నగునూర్‌లోని శ్రీ దుర్గా భవానీ ఆలయంలో జరుగుతున్న ఆషాడమాసం శాకంబరీ ఉత్సవాలలో భాగంగా సోమవారం శ్రీదుర్గాభవానీ అమ్మవారిని గోరు చిక్కుడు కాయల మాలలతో అలంకరించారు. అమ్మవారికి ఆలయ పూజరులు విశేష హారతులు, ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మెన్ వంగల లక్ష్మన్, ఆలయ కమిటి సభ్యులతోపాటు భక్తులు పాల్గోన్నారు.

## యం.ఆర్. పి.ఎస్. 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**సూర్య కరీంనగర్**



యం.ఆర్. పి.ఎస్. 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, కరీంనగర్ జిల్లా యం.ఆర్. పి.ఎస్. అధ్యక్షులు అనిల్ ఆధ్వర్యంలో జరిగిన ఆవిర్భావ సమావేశంలో ముఖ్య అతిథిగా బీజేపీ నాయకులు,మాజీ మేయర్ సునీల్ రావు పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్, ఇతర యం.ఆర్.పి.ఎస్. నాయకులు పాల్గొన్నారు.

## బొలెరో వాహనం ఢీ... వ్యక్తి మృతి

**సూర్య, వీణవంక**



వీణవంక మండలం చల్లూరు గ్రామానికి చెందిన కొలిపాక రాజయ్య (60) అను ఇతడు సోమవారం తెల్లవారుజామున ఆ గ్రామ ప్రధాన రహదారిపై వాకింగ్ చేస్తుండగా బొలెరో వాహనం మామిడాలపల్లి నుండి వైపు వస్తుండగా గ్రామ శివారులో ఢీకొట్టగా రాజయ్య అక్కడికక్కడే మృతి చెందగా బొలెరో తప్పించుకొని వెళ్లగా సమాచారం అందుకొన్న సిఐ లక్ష్మీ నారాయణ, ఎస్ఐ ఆవుల తిరుపతి సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన తీరును పరిశీలించారు. ఢీ కొట్టిన వాహనం మామిడాలపల్లికి చెందిన ఎడ్ల రాజిరెడ్డిదని తెలుసుకొని, వాహనంతో పాటు డ్రైవర్ రాజిరెడ్డిని పోలీస్ స్టేషన్‌కు తరలించి, మృతుని కుటుంబ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వాహనంతో పాటు రాజిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# అభివృద్ధి పనులతో రెండు మండలాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

**సూర్య మేడిపల్లి / భీమారం**

అభివృద్ధి పనులతో రెండు మండలాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం అని కరీంనగర్ ఎంపీ కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. మేడిపల్లి భీమారం రెండు మండలాలలో సోమవారం రోజు కరీం నగర్ ఎంపీ కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పలు అభివృద్ధి కార్యక్రమాలలో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా పలు అభివృద్ధి నిర్మాణాలకు శంకు స్థాపనలు చేశారు. ఈజీఎస్ ఎంపీ ల్యాండ్ నిధులతో మంజూరైన సిసి రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కల్వ కుంట గ్రామంలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో భాగంగా దమ్మన్నపేట నుండి కాచారం వరకు నిర్మిస్తున్న రోడ్డు విస్తరణ పనులను ప్రారంభిం చారు. వెంకట్రావు పేట గ్రామంలోని పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌కు పూల మొక్కలు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాలలో కేంద్ర హెూం శాఖ సహాయ



మంత్రి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామాలే అభివృద్ధికి దేశానికి పట్టుకొమ్మని అన్నారు. ప్రధానమంత్రి సడక్ యోజన ద్వారా ఎంపీ నిధుల ద్వారా సిసి రోడ్లకు నిధులు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ చెన్నమనేని వికాస్ రావు, కోరుట్ల ఆర్డిఓ జీవాకర్, ఈ పి ఆర్ ఇంజనీరింగ్ అధికారి లక్ష్మణరావు, మేడిపల్లి భీమారం తహసిల్దార్లు మునీందర్, రవి కిరణ్, ఎంపీడీవోలు సంబంధిత అధికారులు, బిజెపి పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.

**పీఎంశ్రీ అద్భుత పథకం**

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కేంద్రం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకం అనేది అద్భుతమైన అవకాశం అని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా వెంకట్రావుపేట స్కూల్‌ను సందర్శించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పీఎంశ్రీ కింద దేశవ్యాప్తంగా 14,500 స్కూళ్లను అభివృద్ధి చేయనున్నారు. ఇప్పటి వరకు 13,076 స్కూల్లు ఎంపిక. తెలంగాణలో 832 పాఠశాలలు ఎంపికై కేంద్ర నిధులు పొందు తున్నాయి. ఎంపికైన స్కూల్‌కు రూ. 90 లక్షల నుండి రూ. 2.25 కోట్ల వరకు నిధులు అందజేస్తారు. స్కూళ్ల మౌలిక వసతుల కోసం ఈ నిధులను వినియోగించు కోవచ్చు అని అన్నారు. కరీంనగర్ పార్లమెంట్‌లో ఎక్కువ పాఠశాలలు ఈ పథకంలో చేర్చినట్లు తెలిపారు. త్వరలో హుస్నాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాలో నవోదయ, సైనిక స్కూళ్ల ఏర్పాటు చేస్తామన్నారు. టెన్త్ విద్యార్థులకు 20 వేల సైకిళ్లు, స్కూల్ కిట్లు పంపిణీ చేస్తామన్నారు. "అంబేద్కర్, గాంధీ, సర్దార్ పటేల్, మోదీలా దేశానికి సేవ చేసే విద్యార్థులు ఎదగాలని ఆశిస్తున్నాం," అని మంత్రి అన్నారు.

# శ్రమైక జీవనం...... పరిశుభ్రతే లక్ష్యం

## - సఫాయి కార్మికుల దినచర్య

**సూర్య, హుజురాబాద్**

అందరూ నిద్రలేవక ముందే .... లేవడమే కాకుండా... యూనిఫామ్ వేసుకుని చేతిలో చీపురుతో రోడ్లపై ఉన్న చెత్త ను తొలగిస్తూ... గ్రామమైన, పట్టణమైన, నగరమైన ముందుకు సాగి ప్రజల " ఆరోగ్య రక్షకులే " సఫాయి కార్మికులు... అది నగరం... పట్టణం.... గ్రామం... ఏదైనా శుభ్రత పరిశుభ్రత లక్ష్యంగా పనిచేసే శ్రమైక జీవుల సఫాయి కార్మికుల దినచర్య... పలువురికి ఆదర్శం. వారు చేసే పని పెద్దదైన... వారికి లభించే గుర్తింపు మాత్రం తక్కువే.... అయినా... " ఛీ " అనకుండా " ఛా" అనకుండా మురికిని , చెత్తను తొలగిస్తూ ముందుకు సాగుతుంటారు సఫాయి కార్మికులు. మిగతా ఉద్యోగులకు పండుగలకు సెలవులు ఉంటాయి కానీ వీరికి మాత్రం సెలవులు ఉండవు. పండుగ రోజుల్లో మరింత పని ఎక్కువగా ఉంటుంది. నాయకులు మీటింగులకు వచ్చిన వారికి పని పెరగడమే. సఫాయి కార్మికులు లేకుంటే పట్టణాలన్నీ కంపుకొడతాయి. ప్రభుత్వంలో అనేకమంది ఉద్యోగులున్నప్పటికీ సఫాయి కార్మికులు చేస్తున్న సేవలకు, మిగతా ఉద్యోగులు చేస్తున్న సేవలకు సమానమైన గుర్తింపు రావడం లేదు... కరోనా సమయంలో మాత్రం.... వారి సేవలను సేవల యొక్క ప్రాధాన్యతను ప్రపంచం గుర్తించిందని చెప్పవచ్చు. ప్రతిరోజు తెల్లవారుజామున ఐదు గంటలకే తమ దినచర్యను ప్రారంభించే సఫాయి కార్మికులు 10 గంటల వరకు రోడ్లన్నీ శుభ్రం చేస్తారు. తిరిగి భోజనం ముగించిన తర్వాత రెండు గంటల నుండి ఐదు గంటల వరకు తమకు కేటాయించిన ప్రాంతాలలో పరిశుభ్రత బాధ్యతను తీసుకుంటారు. హుజురాబాద్ మున్సిపాలిటీలో 109 మంది సఫాయి కార్మికులు పనిచేస్తున్నారు.





ఉదయం ఐదు గంటలకే సానిటరీ జవాన్లు అంబేద్కర్ చౌరస్తా వద్ద వారికి అటెండెన్స్ తీసుకొని పట్టణాన్ని ఐదు విభాగాలుగా విభజించి ఐదుగురు సానిటరీ జవాన్ల కింద సఫాయి కార్మికులు పనిచేస్తుం టారు. తెల్లవారుజామున ప్రధాన రహదారులపై శుభ్రం చేసే సఫాయి కార్మికులు ఎన్నో ప్రమాదాలకు గురవుతున్నారు. అయినప్పటికీ తమ విద్యుక్త ధర్మాన్ని మాత్రం మరవకుండా శుభ్రం చేస్తుంటారు. హుజురాబాద్ మున్సిపాలిటీలో పర్మనెంట్ సఫాయి కార్మికులతో పాటు కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికులు కూడా పనిచేస్తున్నారు. వీరితో పని చేయించడానికి ఐదుగురు సానిటరీ జవాన్లు ఉన్నారు. పెరిగిన జనాభా కనుగుణంగా సఫాయి కార్మికుల సంఖ్య మున్సిపాలిటీ కార్మికుల సంఖ్యను పెంచకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో శుభ్రత విషయంలో ఇబ్బందులు అవుతున్నాయి. మొత్తానికి సఫాయి కార్మికులు శుభ్రత లక్ష్యంగా ఉద్యోగ జీవనం కొనసాగిస్తున్నారని చెప్పవచ్చు.

**బాధ్యతగా పనిచేస్తా...**

**- సమ్మయ్య**

గత 30 సంవత్సరాలుగా మున్సిపల్ కార్మికుడిగా ఇచ్చిన పనిని బాధ్యతగా పనిచేస్తున్నానని సఫాయి కార్మికుడు సమ్మయ్య తెలిపారు.

# అప్పుల బాధతో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**సూర్య ఇల్లందకుంట**

అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాచపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే రాచపల్లి గ్రామానికి చెందిన పెద్ది సమ్మయ్యకి (45) ముగ్గురు కుమార్తెలు శృతి, అక్షయ, పల్లవి. మూడు సంవత్సరాల క్రితం తన పెద్ద బిడ్డ శృతికి పెళ్లి చేసి అప్పుల పాలైనాడు. ఆ అప్పులు పెరిగిపోతుండడంతో పెరిగిన అప్పులను ఎలా తీర్చాలో అని తరచుగా బాధపడుతుండే వాడని, దీనివలన మద్యం తాగుడుకు అలవాటు పడినాడని, జూన్ 29 న మక్క చేను వద్దకు వెళ్లి ఉదయం సుమారు 10:30 గంటలకు ఇంటికి తిరిగి వచ్చి కింద పడిపోగా, తన రెండో కూతురు ఏమైందని అడగగా గడ్డి మందు తగినాను అని చెప్పగా, వెంటనే సమ్మయ్యను అతని భార్య ఇతరుల సహాయంతో చికిత్స నిమిత్తం జమ్మికుంట హాస్పిటల్ కి తీసుకుపోగా అక్కడ డాక్టర్ చికిత్స చేసి కండిషన్ సీరియస్ ఉన్నదని అతన్ని వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ కి తీసుకు వెళ్ళమని చెప్పగా, సమ్మయ్యను అతని భార్య కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం ఎంజీఎం హాస్పిటల్ తీసుకువెళ్లి చేర్పించినారు. అక్కడ చికిత్స పొందుతూ జూలై 7 సోమవారం మధ్యాహ్నం 02:50 నిమిషాలకు చనిపోయినాడని అతని తండ్రి పెద్ది ఐలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇల్లందకుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



# రాజన్న ఆలయ హుండీ ఆదాయం 1.99 కోట్లు

**సూర్య, వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ 25 రోజుల హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కింపు నిర్వహించారు. ఈ లెక్కింపులో నగదు రూ. 1,99,84,960, మిశ్రమ బంగారం 188 గ్రాముల 000 మిల్లి గ్రాములు, మిశ్రమ వెండి 14 కిలోల 300 గ్రాములు వచ్చినట్లు కార్యనిర్వహ ణాధికారి రాధాబాయి పేర్కొన్నారు. ఈ లెక్కింపులో ఏసీ కార్యాలయ పరిశీలకులు సత్యనారాయణ, ఏఈఓలు, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఎస్పీఎఫ్ హెూమ్ గార్డు సిబ్బంది భద్రతా ఏర్పాట్లు చూసారు. హుండీ లెక్కింపులో శ్రీ రాజరాజేశ్వర సేవాసమితి వారు పాల్గొన్నారు.

# ప్రభుత్వ దవాఖానలో డెలివరీలను ప్రోత్సహించాలి

## - జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



ప్రభుత్వ ఆసుపత్రి లో ప్రసవాలు సంఖ్య 90 శాతం పెంచాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశించారు. సోమవారం స్థానిక ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అధ్యక్షతన 50 శాతం కన్నా తక్కువగా ప్రభుత్వ ఆసుపత్రి ప్రసవాలు చేయించిన ఆరోగ్య కార్యకర్తలు,ఆశ కార్యకర్తలు సూపర్ వైజర్ లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. గడిచిన ఏప్రిల్ , మే జూన్ మాసాలలో ప్రభుత్వ ఆసుపత్రుల లో డెలివరీల సంఖ్య చాలా తక్కువగా ఉందని పని తీరు మెరుగు పరుచుకోవాలని హెచ్చరించారు. వచ్చే మూడు నెలలలో డెలివరీల సంఖ్య 90% శాతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో నే చేయించాలని ఆదేశించారు. ఈ డి. డి. సమీపంలో ఉన్న గర్భిణులను గుర్తించి టీం సహకారం తో ప్రభుత్వ దవాఖానలో డెలివరీలు అయ్యేటట్లుగా మోటివేషన్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే. ప్రమోద్ కుమార్, ఉపవైద్యాధికారి డాక్టర్ ఎన్ .శ్రీనివాస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జైపాల్ రెడ్డి , డిపిఓ రవీందర్, ఆరోగ్య విద్య బోధకులు భూమేశ్వర్ , తరాల శంకర్, రాజేశం, శ్రీధర్,వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# స్వామివారి కల్యాణ స్థల ప్రహరీ గోడకు భూమి పూజ

## - భూమి పూజలో పాల్గొన్న మంత్రి అడ్లూరి. లక్ష్మణ్ కుమార్

**సూర్య ధర్మపురి:**



ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి బ్రహ్మోత్స వాలలో జరిగే కళ్యాణ మహోత్సవ స్థలానికి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సోమవారం భూమి పూజ చేశారు. పట్టణంలోని స్థానిక బ్రాహ్మణ సంఘం వద్ద స్వామి వారి కళ్యాణం జరిగిన స్థలం యొక్క ప్రహరీ, ఫెన్సింగ్ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మండల నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని నెలల క్రితం ఆలయ అర్చకులు, అధికారుల సూచనల మేరకు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని స్థానిక బ్రాహ్మణ సంఘం వద్ద గల శ్రీ సచ్చిదానంద స్వామి వారి స్థలంలో ఘనంగా నిర్వహించడం జరిగిందనీ తెలిపారు. అట్టి స్థలంకు బదులుగా సచ్చిదా నంద స్వామి వారికి వేరే చోట స్థలాన్ని కేటాయించి కళ్యాణం జరిగిన స్థలంలో కల్యాణ మండపం ఏర్పాటు చేసి చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేయడానికి వారిని కోరగా వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. స్వామివారి కళ్యాణం జరిగే ఈ స్థలాన్ని ఎల్లప్పుడూ పవిత్రంగా ఉంచే విధంగా చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేయడానికి పనులు ప్రారంభించడం జరుగుతుందని, అన్నదాన సత్రం ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఈవో సంకటాల శ్రీనివాస్, అర్చకులు, ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగనబట్ల దినేష్, ఉపాధ్యక్షులు వేముల రాజేష్, పట్టణ అధ్యక్షులు చీపిరి శెట్టి రాజేష్, నాయకులు సీపతి సత్యనారాయణ, సుముక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వినూత్నంగా గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమాన్ని చేపట్టిన కేటీఆర్

- తన జన్మదినం సందర్భంగా ఈ నెల 24న సిరిసిల్లలో కెసిఆర్ కిట్‌ల పంపిణీ
- 18 నెలలుగా జిల్లాలో పుట్టిన ప్రతి ఒక్క తల్లికి, శిశువుకు కేసీఆర్ కిట్ అందించనున్న కేటీఆర్
- గత ఐదు సంవత్సరాలుగా చేపడుతున్న గిఫ్ట్ స్మైల్ తనకు అత్యంత సంతృప్తిని ఇచ్చిందన్న కేటీఆర్

**సూర్య రాజన్న సిరిసిల్ల**

ఈనెల 24న తన జన్మదినం సందర్భంగా మరో సారి మానవీయ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ శ్రీకారం చుట్టారు. గత సంవత్సర కాలంగా తన నియోజకవర్గంలో జన్మించిన 4910 మంది శిశువులు, వారి మాతృమూర్తులకు కేసీఆర్ కిట్లను పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ప్రజల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ అద్భుతమైన సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలుచేశారని, అందులో తనకు అత్యంత ఇష్టమైన కార్యక్రమం కేసీఆర్ కిట్ అన్నారు కేటీఆర్. మాత శిశు మరణాలను భారీగా తగ్గించి, తల్లికి శిశువుకు మంచి ఆరోగ్యాన్ని అందించే కేసీఆర్ కిట్‌ను ప్రస్తుత సిఎం రేవంత్ రెడ్డి పట్టించుకోవడం లేదని విమర్శించారు. అందుకే సిరిసిల్ల జిల్లాలో గత 18 నెలలుగా పుట్టిన ప్రతి ఒక్క శిశువుకు కేసీఆర్ కిట్‌ను అందిస్తానని కేటీఆర్ తెలిపారు. తన పుట్టినరోజు సందర్భంగా గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా ఐదు సంవత్సరాలుగా అనేక



కార్యక్రమాలను చేపట్టామని కేటీఆర్ తెలిపారు. 2020 సంవత్సరంలో కరోనా ప్రపంచాన్ని కుదిపేస్తున్న సందర్భంలో తన అనుచరులు, కార్యకర్తలు గిఫ్ట్ ఏ స్మైల్ ద్వారా 108 అంబులెన్స్ వాహనాలను ప్రభుత్వ ఆసుపత్రులకు అందించారని గుర్తుచేశారు. ఆ తర్వాత 2021లో 14 మంది దివ్యాంగులకు సహాయం అందించారని చెప్పారు. 2022 సంవత్సరంలో సుమారు 600 సామ్‌సంగ్ మొబైల్ టాబ్స్‌ను సిరిసిల్ల జిల్లాలోని విద్యార్థులకు అందించామని, వీటి ద్వారా విద్యార్థులు నీట్, జేఈఈ వంటి పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యారని, అనేకమంది ఉత్తమ ర్యాంకులు సాధించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడిందని కేటీఆర్ గుర్తుచేసుకున్నారు. 2023 సంవత్సరంలో ప్రతిభాపాటవాలు కలిగిన 116 మంది స్టేట్ హెూం (యూసుఫ్‌గూడ) విద్యార్థులకు లాప్‌టాప్‌లు అందించి, అవసర మైన శిక్షణకు వారికి మద్దతు అందించినట్లు తెలిపారు. అదే సంవత్సరం సిరిసిల్లలో ఆత్మ హత్య చేసుకున్న నేతన్నల కుటుంబాలకు సహకారం అందించినట్లు చెప్పారు. ఒక చిన్న ఆలోచనగా ప్రారంభమైన గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం గత ఐదు సంవత్సరాలుగా వేలాదిమంది జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకువచ్చినందుకు ఎంతో సంతోషంగా ఉందన్న కేటీఆర్, ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఏబిసిడి వర్గీకరణ

## - ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అంబాల రాజేందర్

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**

మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఏబిసిడి వర్గీకరణని పెద్దపల్లి జిల్లా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అంబాల రాజేందర్ అన్నారు. సోమవారం కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ 31 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పెద్దపల్లి జిల్లా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అంబాల రాజేందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగరవేశారు. ఎమ్మార్పీఎస్ ఏబిసిడి వర్గీకరణ కోసం 31 సంవత్సరాలలో సహాయ సహకారలు అందించిన ప్రజా ప్రతి





నిధులకు, నాయకులకు ప్రెస్ మిత్రులకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అంబాల రాజేందర్ మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరించాలని మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో ముప్పై ఏళ్ళు రాజీలేని పోరాటం సాగిందన్నారు. ఆ పోరాట ఫలితంగానే నేడు తెలంగాణ రాష్ట్రంలో వర్గీకరణ చట్టం అమలులోకివచ్చిందని, దాని ద్వారా మాదిగలకు 9% రిజర్వేషన్లు దక్కాయి. ఎన్నో త్యాగాల ద్వారా సాధించుకున్న రిజర్వేషన్ ఫలాలు మాదిగ విద్యార్థులు నిరుద్యోగులు అందిపుచ్చుకొని అన్నిరంగాల్లో అభివృద్ధిలోకి రావాలని పిలుపునిచ్చారు. అలాగే ఎస్సీ వర్గీకరణతో పాటు ఆరోగ్యశ్రీ, వికలాంగులు వృద్ధులు,వితంతువుల, ఒంటరి మహిళల పెన్షన్లు, తెలంగాణ అమరుల కుటుంబాలకు ఉద్యోగాలు, మహిళల భద్రత కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు మొదలగునవి ఎమ్మార్పీఎస్ సాధించి అన్ని వర్గాలకు అండగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బర్ల తిరుపతి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, మాజీ జెడ్పిటిసి లంక సదయ్య, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు సదయ్య, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ రాజమల్లు, మాజీ వైస్ ఎంపీపీ జూగంటి శిరీష, ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రే సంజీవ రెడ్డి జన్మదిన వేడుకలు

**సూర్య- సుల్తానాబాద్**



భారతీయ జనతా పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్రే సంజీవ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలోని బీజేపీ నాయకులు, శ్రేణులు ఘనంగా నిర్వహించారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. గర్రెపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు ప్లేట్‌లు పంపిణీ చేసారు. సుల్తానాబాద్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు ఆధ్వర్యంలో గుడిమిట్టపల్లి మహా శివాలయములో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ దవాఖానలో పేషంట్లకు పండ్లు పంపిణీ చేశారు. బిజెపి పార్టీ కార్యాలయానికి వచ్చేసిన కర్రె సంజీవ రెడ్డికి పుష్ప గుచ్ఛం అందించి శాలువాలతో సన్మానించి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కడారి అశోక్ రావు, సౌదరి మహేందర్ యాదవ్, కామని రాజేంద్రప్రసాద్, కొమ్ము తిరుపతి యాదవ్, గుడ్ల వెంకటేష్, గజభింకర్ పవన్, ఎనగందుల సతీష్, పల్లె తిరుపతి, జిల్లా నాయకులు చిట్టవేని సదయ్య, కొల్లూరి కుమార్, బుర్ర సతీష్ గౌడ్, రామిడి రవీందర్, వల్స సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎలిగేడులో ఎంఆర్‌పిఎస్ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు

**సూర్య ఎలిగేడు**



మండల కేంద్రంలో ఎంఆర్‌పిఎస్ 31వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సందర్భంగా పద్మ శ్రీ అవార్డు గ్రహీత మన్యశ్రీ మంద కృష్ణా మాదిగ జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేసి స్విట్లు పంపిణి చేశారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో ఎం ఆర్ పి ఎస్ మండల అధ్యక్షుడు బాసంపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఇరుగురాల సదానందం, మల్లారపు మహేందర్, బాసంపెల్లి వినోద్, జల్లి రమేష్ మండల ఇంచార్జీ తిప్పారపు లక్ష్మణ్, గంగారాం, సీనియర్ నాయకులు కవ్వంపల్లి బాపయ్య, న్యాతరి పోచయ్య, మాజీ సర్పంచ్ ఆర్ కె రాజా, బూర్ల సత్యం, దుగ్యాల సంతోష్ రావు, నాయకులు మామిడాల రమేష్, కవ్వంపెల్లి కొండయ్య, బసంపెల్లి సర్వయ్య, అసంపెల్లి రవీందర్, రాయపాక మనోహర్, సచిన్, సంపత్, రాజేశం, శంకర్, ప్రశాంత్, శ్రవణ్ కుమార్, శ్రీనివాస్ రావు, నర్సయ్య, సదానందం తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ లబ్ధిదారులకు అనుమతి పత్రాల పంపిణీ

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**



కాల్వశ్రీరాంపూర్ మండలం మీర్జం పేట గ్రామంలో ఎమ్మెల్యే విజయ రమణారావు, మాజి ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్‌ల ఆదేశాల మేరకు నరెడ్ల లావణ్య ఉల్లి సంధ్య కొప్పుల సతీష్ బుర్కా పుష్పలత పంజాల జోష్ణ బొడ్డుపెల్లి విజయ్ తిప్పని లలిత బత్తిని సరోజన పర్లపెల్లి సోనీ 9 మందికి ఇందిరమ్మ ఇండ్ల అనుమతి పత్రాలను అందజేసినట్లు చాలా సదానందం తెలిపారు. అదేవిధంగా పలు ఇండ్ల నిర్మాణాలకు ముగ్గురు పోసినట్టు తెలిపారు. గ్రామ కార్యదర్శి సందీప్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో కార్యదర్శి సంధిఫ్, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ పోశాల సదానందం గౌడ్, ఉయ్యాల స్వామి గౌడ్, బొంగోని లింగయ్య, బొడ్డుపెల్లి మల్లేష్, తిప్పని తిరుపతి, బుర్ర మధునయ్య, పంజాల చమన్, బుర్కా అశోక్, పంజాల తిరుపతి, బుర్కా శ్రీకాంత్, ఉల్లి మల్లేష్, చిర్లవంచ శ్రీనివాస్, చల్ల స్వామి, గోపు మల్లయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిత్యావసర సరుకులు అందజేత

**సూర్య - పెద్దపల్లి రూరల్**



లయన్స్ క్లబ్ అఫ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో క్లబ్ సీనియర్ సభ్యు లు లయన్ ముత్యాల రాజ య్య పుట్టినరోజు సందర్భంగా మండలంలోని తుర్కల మద్దికుంటలోని ఇద్దరు నిరుపేద ఒంటరి మహిళకు రూ 2000/- విలువ గల నెలకు సరిపడే నిత్యావసర సరుకులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పెద్దపల్లి అధ్యక్షులు లయన్ రాంకిషన్ బోడకుంట, సెక్రటరీ లయన్ మీసాల సత్యనారాయణ, జోన్ చైర్మన్ లయన్ సాదుల వెంకటేశ్వర్లు, ఇమిడి యేట్ పాస్ట్ ప్రసిడెంట్ లయన్ వేల్పుల రమేశ్, లయన్ దుబాసి కుమార్, రామ్ చందర్, భూమయ్యలు పాల్గొన్నారు.

# బొలెరో వాహనం డికొని వ్యక్తి మృతి

**సూర్య ధర్మారం**



ధర్మారం మండల కేంద్రంలో కరీంనగర్ - రాయపట్నం రహదారిపై పెట్రోల్ బంకు వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన మేడ వేణి చిన్నయ్య (68)అనే వ్యక్తి మృతి చెందాడు. చిన్నయ్య టీవీఎస్ ఎక్సెల్ పై పెట్రోలు పోయించడానికి వెళ్తున్నాడు. ఎడమ వైపు నుంచి కుడి వైపు పెట్రోల్ బంక్ వైపుకు వెళుతున్న క్రమంలో కరీంనగర్ నుంచి మంచిర్యాల వైపు వెళుతున్న బొలెరో వాహనం అతివేగంగా ఎక్సెల్‌ను ఢీ కొట్టి కొంత దూరం ఈడ్చి కెళ్ళింది. దీంతో తీవ్ర గాయాలపాలై తలకు బలమైన దెబ్బ తగిలి చిన్నయ్య అక్కడికక్కడే మరణించాడు. స్థానిక ఎస్సై లక్ష్మణ్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కరీంనగర్ లోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

# వృద్ధురాలిని నమ్మించి బంగారం ఎత్తుకెళ్లిన యువకులు

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**

ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై బంగారంను దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటన పెద్దపెల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం కూనారం గ్రామంలో చోటుచేసుకుంది. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని కునారం గ్రామానికి చెందిన దేవర్ల రాజవ్వ(75) అనే ఒంటరి వృద్ధురాలు తన ఇంటి ముందు కూర్చోగా ఇద్దరు యువకులు బైక్ పై ఇంటికి వచ్చి తాము ఇక్కడ కూర్చొని కల్లు తాగి వెళ్తామని చెప్పి వృద్ధురాలు నమ్మించి వృద్ధురాలతో మాట్లాడుతూ వృద్ధురాలు మెడలోని రెండు తులాల బంగారు పుస్తల తాడును తెంపుకొని పారిపోయినట్లు వృద్ధురాలు రాజవ్వ తెలిపారు. వృద్ధురాలు కేకలు వేయడంతో చుట్టూ పక్కల వారు వచ్చి పోలీసులకు సమాచారం అందించడంతో సుల్తానాబాద్ సిఐ సుబ్బారెడ్డి ఎస్సై వెంకటేష్ క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో పరిసరాలను పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె నోటీస్

**సూర్య కోరుట్ల ప్రతినిధి**



మధ్యాహ్న భోజనం పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కోరుట్ల మండల ఎంఈఓ అధికారి నరేశం వినతి పత్రం అందజేశారు.సోమవారం రోజున మిడ్ డే మీల్స్ వర్కర్స్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మండల విద్యాధికారులకు సమ్మె నోటీసు ఇచ్చిన అనంతరం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సుతారి రాములు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుండి పోరాడి త్యాగాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడులను తీసుకువచ్చి వాటిని అమలుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న సందర్భంగా దేశవ్యాప్తంగా ఉద్యోగ కార్మిక ప్రజా సంఘాలు ఈనెల తొమ్మిదిన జరిగే జాతీయ సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులు జిల్లా వ్యాప్తంగా వంట బంద్ చేసి సమ్మెలో పాల్గొంటున్నారని తెలిపారు. 4 లేబర్ కోడ్లు రద్దు చేయాలని కార్మికులను స్కీం వర్కర్లుగా గుర్తించి ఐడెంటి కార్డులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో హామీ ఇచ్చిన ప్రకారం పదివేల రూపాయలు గౌరవ వేతనం ఇవ్వాలని సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని ఈఎస్ఐ పిఎఫ్ పెన్షన్ పథకం అమలు చేయాలని ప్రభుత్వము విద్యార్థులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు తదుపరి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఎనిమిది గంటల పనికి బదులు 12 గంటలు పని చేయాలని తెచ్చిన జీవో 242 కాపీని దగ్ధం చేశారు ఈనెల 21 నుండి జరుగుతున్న పార్లమెంటు సమావేశం సందర్భంగా కార్మికులు పెద్ద ఎత్తున ఢిల్లీకి చేరుకొని ఆందోళన కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా నేతలు చొప్పరి గంగాధర్ సంగం పద్మ కొంక భాగ్యలక్ష్మి అనిషా రాజు గంగు లత జరిన పి హారిక తదితరులు పాల్గొన్నారు.

# క్షణ మాత్ర అనుభూతే బ్రహ్మానందం...

## - బ్రహ్మశ్రీ గర్రెపల్లి మహేశ్వరశర్మ

**సూర్య కోరుట్ల ప్రతినిధి**




భగవంతుని దర్శనం చేసుకున్నప్పుడు ఆ క్షణంలో కలిగే అనుభూతే బ్రహ్మానందం అని శృంగేరి శారదాపీఠ ఆస్థాన పౌరాణికులు బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వరశర్మ పేర్కొన్నారు. సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో కోరుట్ల వాసవి కళ్యాణ భవనంలో 'శ్రీ నారద మహా పురాణ సప్తాహం' 4వ రోజు సోమవారం వైభవంగా జరిగింది. సమితి ఉపాధ్యక్షులు డాక్టర్ వేముల ప్రభాకర్ డాక్టర్ అరుణ దంపతులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ శక్కరి వెంకటేశ్వర్ దంపతులు గురువందనం చేశారు. ప్రవచనంలో భాగంగా భగవత్ దర్శనానికి వెళ్ళినప్పుడు అప్పటి వరకు మనసులో ఉన్న ఆలోచనలన్నీ దూరమై దైవ దర్శనం కాగానే ప్రత్యేక అనుభూతి పొందుతామన్నారు. అలా క్షణ మాత్రం కలిగిన అనుభూతి శాశ్వతంగా కావాలని కోరడంతోనే బ్రహ్మ మానస పుత్రునిగా, నారద మహర్షి అవతరించాడని వివరించారు. నాస్తికులకు, వ్యసనపరులకు మనం దూరంగా ఉండాలని, వారు తమ ఆలోచనలు, వాదనలతో మనల్ని కూడ చెడగొట్టే అవకాశం ఉంటుందన్నారు. మన దైనందిన జీవితంలో పరవతి, రికమండేషన్, డబ్బు ఉపయోగించి అన్ని పనులు చేసుకోవచ్చు కానీ, ఆ పరమాత్మున్ని మాత్రం మనం చేసిన పుణ్య ఫలంతోనే సాధించుకోగలమని డాక్టర్ గర్రెపల్లి మహేశ్వరశర్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు మంచాల జగన్, ప్రధాన కార్యదర్శి బట్టు హరికృష్ణ, పురాణ కమిటీ చైర్మన్ పడిగెల శ్రీనివాస్, కన్వీనర్ మోటూరి రాజు, నిర్వాహకులు భోగ శ్రీధర్, చౌడారపు శ్రీనివాస్, వొటారి చిన్న రాజన్న, ఎనుగందుల శ్రీనివాస్, రుద్ర సుధాకర్, పడిగెల పవన్, వనపర్తి చంద్రం, కంటాల రవీందర్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యమత్యంతో సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**- జేఏసీ కన్వీనర్ కోట రవీందర్ రెడ్డి**

**సూర్య, సెంటినరీ కాలనీ**

కార్మికులంతా కలిసి ఐక్య మత్యంతో ఈ నెల 9వ తేదీన నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయ ప్రదం చేయా లని జేఏసీ కన్వీనర్, ఐఎన్టియుసి యూనియన్ ఆర్జీ-3 వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్జీ-3 డివిజన్ లోని ఓసీపీ-1,2 ప్రాజెక్టులలో, ఏపిఎ డివిజన్ లో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ గేట్ మీటింగ్ కి ఆయన హాజరై మాట్లాడారు. సమ్మె విషయంలో మోసం పోతే గోస పడతామని, దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రకాల కార్మికులు చేస్తున్న సమ్మె అని గుర్తు చేసుకోవాలని తెలిపారు. సమ్మె విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్న వారు భవిష్యత్తులో జరిగే విధ్వంసానికి కారణం అవుతారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు మరియు నాలుగు లేబర్ కోడ్ల రద్దు చేయడమే ప్రధాన డిమాండ్ అని తెలిపారు. లేబర్ కోడ్స్ వల్ల కార్మికుని వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులు కోసం పని చేసే పలు కార్మిక చట్టాలు రద్దు అవుతున్నాయని, కార్మికుడు కోసం పనిచేసే దాదాపు 44 చట్టాలను ఏకపక్షంగా రద్దుచేసి లేబర్ కోర్టులను రూపొందించింది. ఇట్టి నిర్ణయం వల్ల కార్మికుల తమ ప్రాథమిక హక్కులు కోల్పోవడం జరుగుతుందన్నారు.కాంట్రాక్టు కార్మికుల జీతాల పెంపు మరియు పర్మినెంట్ చేయాలని కోరడం జరుగుతుందని, సింగరేణి కార్మిక యూనియన్ లేబర్ కోడ్స్ లను వెంటనే రద్దు చేయాలని జేఏసీ తరపున కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఇలా మరెన్నో కార్మికుల హక్కులు కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 09వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో జేఏసీ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



## సహచర విద్యార్థి కుటుంబానికి అండగా నిలిచిన పూర్వ విద్యార్థులు

**సూర్య,రాయికల్**

మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన 2007-2008 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ సహచర విద్యార్థిని పడాల సాగరిక కుటుంబానికి అండగా నిలిచారు.సాగరిక తల్లి క్యాన్సర్ బారిన పడటంతో ఆమె చికిత్సకు పెద్ద మొత్తంలో డబ్బు అవసరమైంది.ఈ విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు చలించిపోయారు.వారంతా కలిసి రూ. 31,000 ఆర్థిక సహాయాన్ని సాగరిక కుటుంబానికి అందజేశారు.వారి ఈ సహాయం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం అని గ్రామస్తులు అభినందించారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు...

**సూర్య - పెద్దపల్లి రూరల్**




మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో కుల వ్యవస్థలో అణగారిపోయిన కులాలన్ని ఏ కులానికి ఆ కులం సామాజిక చైతన్యమై అంతిమంగా మహాజన సమూహంగా ఏకం కావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మందకృష్ణ మాదిగ మొదలుపెట్టిన ఎమ్మార్పీఎస్ ఉద్యమ ప్రభావం అన్ని అణగారిన కులాల్లో సామాజిక చైతన్యాన్ని రగిలించిందని అన్నారు. ప్రతి కులం తమ అస్తిత్వాన్ని చాటుకోవడానికి సంఘాల ఏర్పాటు చేసుకొని పోరాట బాటలోకి వచ్చాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జోగు రాజయ్య, ప్రధాన కార్యదర్శి పల్లె విజయ్, ఇజ్రాయెల్, హనుమయ్య, అంజయ్య, కనుకయ్య, మధురయ్య, దేవయ్య, మల్లేశం, రాజేందర్, పెర్క సంతోష్, కొండయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి జన్మదిన వేడుకలు

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**



బిజెపి పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్ర సంజీవరెడ్డి జన్మదిన వేడుకలను బిజెపి నాయకులు కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సంజీవరెడ్డి మరెన్నో పదవులు అధిరోహించాలని, నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో కలకాలం జీవించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు గూడెపు జనార్దన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు కాసగోని నిర్మల, నాయకుడు ముల్కోజు వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి సల్పాల బాలకృష్ణ, రామగిరి మహేందర్, మండల ఉపాధ్యక్షులు జంగా కిరణ్ రెడ్డి ,గుడ్ల నరేష్, శనవేన కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## 9వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

**- భవన నిర్మాణ కార్మిక సమ్మెక్య సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు చిలువేరు స్వామి**

**సూర్య, సెంటినరీ కాలనీ**



దేశవ్యాప్తంగా ఈ నెల 09వ తేదీన సార్వత్రిక సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం (బి.ఎన్.కే.ఎస్.ఎస్) పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు చిలువేరు స్వామి కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్పు చేస్తున్న నిర్ణయానికి వ్యతిరేకిస్తూ కలిసికట్టుగా సమ్మెలో పాల్గొనాలన్నారు.1996 చట్టం పూర్తి స్థాయిలో అమలు చేయాలని, కార్మిక సంఘాల నాయకులతో వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీ వేయాలని, ఈఎస్ఐ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని,వెల్ఫేర్ బోర్డులో ఉన్న నిధులను కార్మిక సంక్షేమం కోసం వినియోగించాలని, కార్మిక చట్టబద్ధ హక్కుల అమలుకై పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ కె షరీఫ్, కుసుమ సురేష్, వెంగలి రాములు, జంగిలి తిరుపతి, సంతోష్, రమేష్, మహేందర్ పాల్గొన్నారు.

## ప్రత్యేక అధికారుల పాలనలో పడకేసిన పారిశుద్ధ్యం

**- తాత్కాలిక కార్యదర్శితో లోపించిన పర్యవేక్షణ**

**- శాశ్వత కార్యదర్శినీ నియమించాలంటున్న ప్రజలు**

**సూర్య ఎండపల్లి**



అసలే వానకాలం, సీజనల్ వ్యాధుల ప్రబలే సమయంలో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ లోపం అడుగడుగునా స్పష్టంగా కనబడుతుంది. మండలంలోని ఉండేడ గ్రామంలో పారిశుధ్యం పడకేసింది. డ్రైనేజీలలో చెత్తాచెదారం పేరుకుపోయి, దుర్గంధం వెదజల్లుతుంది. రోడ్డుపై చెత్త పేరుకుపోయి దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. గ్రామానికి పూర్తిస్థాయిలో కార్యదర్శి లేక పారిశుధ్య నిర్వహణ సరిగాని లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఇంచార్జ్ కార్యదర్శిని నియమించినా వారు ఎప్పుడు వస్తారో తెలియక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు, గ్రామంలో ఇంచార్జి కార్యదర్శి పర్యవేక్షణ పూర్తి స్థాయిలో లేక గ్రామంలో పారిశుధ్య నిర్వహణ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న సామెత గా మారిందని అటు గ్రామ పాలన ఇటు పారిశుధ్య నిర్వహణ సరిగా లేదని ఇప్పటికైనా ఉన్నతాధికారులు



స్పందించి గ్రామానికి పూర్తిస్థాయిలో కార్యదర్శిని నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కత్తి వెంకటస్వామి ని కలిసిన జువ్వాడి కృష్ణారావు

**సూర్య కోరుట్ల ప్రతినిధి**



రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు సోమవారం హైదరాబాదులోని గాంధీభవన్లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు స్థానిక ఎన్నికల పరిశీలకుడు కత్తి వెంకటస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు వెంకటస్వామితో కాంగ్రెస్ పార్టీ సంస్థ గత వ్యవహారాలపై చర్చించారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు..!

## - ఎమ్మెల్యే విజయరమణ రావు

**సూర్య ఎలిగేడు**



కాంగ్రెస్ ప్రజా పాలనలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పేర్కొన్నారు.ఎలిగేడు మండలం ముప్పిరితోట, లోక పేట గ్రామంలో సోమవారం సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి ఇందిరమ్మా ఇండ్ల ప్రొసీడింగ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు గారు మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో పేదలను పట్టించుకోకుండా ఇండ్లు మంజూరు చేయలేదని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు దశలవారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగానే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. అర్హులైన అందరికీ ఇండ్లను మంజూరు చేస్తామని, మలిదశలోనూ అర్హులైన వారిని గుర్తించి ఇండ్లు ఇప్పిస్తామన్నారు. రెండు లక్షల రూపాయల రుణమాఫీ, తిరిగి రుణ సదుపాయం, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, ఉచిత కరెంటు, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం, రేషన్ కార్డు ద్వారా సన్నబియ్యం పంపిణీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సదుపాయానికి రూ. 10 లక్షలకు పెంపు, కటింగులు లేకుండా వడ్ల కొనుగోల్లు, సన్న వడ్లకు రూ. 500ల చొప్పున బోనస్, కొత్త రేషన్ కార్డులు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రతి కుటుంబానికి అందజేస్తున్నట్టు చెప్పారు. సంవత్సరంన్నర కాలంలోనే ఇన్ని సంక్షేమ పథకాలను చేపట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అలాగే గ్రామాల్లో అనేక అభివృద్ధి పథకాలను, రోడ్లు, డ్రైనేజీలు రవాణా వంటి మౌలిక సదుపాయాలను చేపట్టడం జరుగుతుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోను కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటే అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరింత ముందు కు తీసుకువెళ్లే వీలుంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నిలబెట్టే అభ్యర్థులను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రవ ంలోఎంపీడీఓ ప్రభుత్వం అధిక ారులు %రాజు% హౌసింగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు,సమా రాజేశ్వర్ రెడ్డి, దుగ్యలా సంతోష్ రావు, అర్షణపల్లి వెంకటేశర్ రావు, పెద్దపల్లి దేవరాజు, కోట లైలాయ్య, శ్రవణ్ శ్రీనివాస్, మల్లేష్, కోర్కంటి వెంకటేశగర్ రావు,హెూటల్ సత్తన్న, బూర్ల సత్యనారాయ ణ,కొండా తిరుపతి గౌడ్ కార్యకర్తలులబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# హరిత హారానికి పదేళ్లు పూర్తి

## - బీఆర్ఎస్ నాయకులు నిమ్మశెట్టి విజయ్

## - మొక్కలు నాటిన బిఆర్ఎస్ నాయకులు

**సూర్య, వేములవాడ:**

కేసిఆర్ ప్రారంభించిన హరిత హారం కార్యక్రమం చేపట్టి పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వేములవాడ నియోజకవర్గ హరిత సేన కమల్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం బిఆర్ఎస్ నాయకులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వేములవాడ మాజీ కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్, మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు మాట్లాడుతూ హరిత హారం పది వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గౌరవ మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమంలో పాల్గొని హరిత హారం గుర్తుగా స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి మొక్కలు నాటడం జరిగింది. పర్యావరణ పరిరక్షణ కోసం కేసిఆర్ పల్లెలు, పట్టణాలు అని తేడా లేకుండా రాష్ట్ర మంతటా కోట్ల మొక్కలు నాటి తెలంగాణ అంతటా పచ్చదనాన్ని తీసుకువచ్చారన్నారు. మొక్కలు నాటితేనే సరైన సమయంలో వర్షాలు కురుస్తాయని, బావి తరాలకు కూడా మంచి ఆక్సిజన్ అందించవచ్చని తెలిపారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఇప్పటి వరకు ఎక్కడ కూడా మొక్కలు నాటలేదని, నర్సరీల్లో ఎక్కడి మొక్కలు అక్కడే ఉన్నాయని, అందుకే మేము గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా ఎక్కడ చిన్న మంచి కార్యక్రమం జరిగిన అందులో పాల్గొని వారితో కలిసి హరిత సేన టీమ్ వారు మొక్కలు నాటిపిస్తున్నారన్నారు. ఇది మంచి పరిణయం అని, ఇలాగే మేము కూడా ఏదైనా సందర్భంలో కాని మా వంతుగా హరిత హారం గుర్తు చేస్తూ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి కేసిఆర్ కు కానుకగా అందిస్తాం అని తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కందుల క్రాంతి కుమార్ వసల శ్రీనివాస్, సిరిగిరి చెందు, గోపు గణేష్, బియ్యాల ప్రమోద్, గ్రీన్ హరిత సేన జిల్లా జిల్లా ఇంచార్జి కమల్ గౌడ్, వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి నీరటీ కుమార్, టౌన్ ఇన్చార్జి సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ లో జువాలజీ పోస్ట్ కు దరఖాస్తుల ఆహ్వానం

**సూర్య,రాయికల్**

రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామంలో గల మోడల్ స్కూల్లో ఖాళీగా ఉన్న పీజీటీ జువాలజీ పోస్టుకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కే.సంతోష్ తెలిపారు.అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 10వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని,ఇట్టి పోస్టుకు ఎమ్మెస్సీ జువాలజీ,బి.ఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని ఆయన తెలిపారు.ఈ నెల10వ తేది రోజున డెమో క్లాసు నిర్వహించడం జరుగుతుందని,ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పత్రిక ప్రకటనలో ఆయన తెలిపారు.

# 9 వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

## - సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ

**సూర్య, సెంటినరీ కాలనీ**



సింగరేణి సంస్థలో ఈ నెల 09వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు, టిబిజికెఎస్ యూనియన్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి పిలుపునిచ్చారు. ఆర్జీ-3 డివిజన్ ఓసీపీ-1 ప్రాజెక్ట్ లో ఆపరేషన్స్ సైట్ ఆఫీస్, బేస్ వర్క్ షాప్ నందు గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ గేట్ మీటింగ్ కు వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా విభజించి, 10 నుంచి 12 గంటల పనిదినాన్ని అమలుకై ప్రయత్నిస్తున్న కేంద్ర ప్రభుత్వ ఆలోచనలను విరమింప చేసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 09న దేశవ్యాప్తంగా తలపెట్టిన ఒక్కరోజు సార్వత్రిక సమ్మె ప్రాముఖ్యత గురించి కార్మికులకు వివరించి కార్మికులందరూ కచ్చితంగా సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ గేట్ మీటింగ్ ఐఎన్టీయూసీ కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్ అధ్యక్షతన నిర్వహించగా పింగిలి సంపత్ రెడ్డి, గిటుకు శ్రీనివాస్, శ్రీకాంత్ రావు, ఏఐటీయూసీ గని పిట్ కార్యదర్శి డిటిరావు, పూర్ణాకర్, సల్ల శేఖర్, సంజీవ్, ఐఎన్టియుసి గని పిట్ కార్యదర్శి జి.వెంకటస్వామి, బ్రాంచ్ కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, నాయకులు జక్కుల దామోదర్ రావు, సదానందం, పంజాల వెంకటేశ్వర్లు, సయ్యద్ సలీం, ప్రవీణ్ రెడ్డి, రామచంద్రరావు, రామ్ రెడ్డి, టి.ఆనంద్, రాజన్న, సిఐటియు నాయకులు గోపాల్, హెచ్ఎంఎస్ నాయకులు ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంఅర్పిస్ ఆవిర్బవ దినోత్సవం వేడుకలు

**సూర్య గంగాధర**




గంగాధర మండల కేంద్రములో ఎంఆర్పీస్ 31వ ఆవిర్బవ దినోత్సవం వేడుకలు ఎంఅర్పిస్ మండలాధ్యక్షుడు గంగాధర రవి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మందకృష్ణ మాదిగ 60 వ జన్మదిన వేడుకలను సైతం నిర్వహించారు. మండల కేంద్రంలో ఎంఆర్పిస్ జెండ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లెల లచ్చన్న ఎం ఇ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లేపల్లి మల్లేశం జిల్లా ఉపాధ్యక్షులు చిలుముల రాజయ్య మాదిగ రాష్ట్ర నాయకులు గంగాధర ప్రవీణ్ అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు బెజ్జంకి నరేష్ మాదిగ ఎం ఎస్ పి మండల అధ్యక్షులు దోమకొండ మల్లయ్య సీనియర్ నాయకులు ద్యావ శ్రీనివాస్ సీనియర్ నాయకులు సంజీవ్ గంగాధర కొమురయ్య నాయకులు కల్లేపల్లి గంగసాగర్, ఎం ఆర్ పి ఎస్ ప్రధాన కార్యదర్శి సుంకె అంజయ్య,ఎం ఎస్ పి మండల ఉపాధ్యక్షులు గంగాధర మల్లేశం. నాగిరెడ్డి పూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు బెజ్జంకి ఇసాక్, ర్యాలపల్లి ఎం ఆర్ పి ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు ద్యావ శ్రీనివాస్ కురిక్యాల గ్రామశాఖ అధ్యక్షులు కిషన్ వి హెచ్ పి ఎస్ వెంకటేశ్, ఎ వెంకటేష్ మహిళలు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.




# విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

**సూర్య సిరిసిల్ల టౌన్**

పెండింగ్ స్కాలర్షిప్స్,ఫీజు రియంబర్స్మెంట్,బెస్ట్ అవైలబుల్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలంటూ భారత విద్యార్థి ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.అనంతరం ఏవోకి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్ష,కార్యదర్శు లు గుండెల్లి కళ్యాణ్,మల్లారపు ప్రశాంత్ లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత ఆరు సంవత్సరాల నుండి 8,158 కోట్లు పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్,స్కాలర్షిప్స్ విడుదల చేయాలని, విద్యార్థుల నుండి కాలేజ్ యాజమాన్యాలు ఫీజులకై వేధిస్తున్నారని, ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని మండి పడ్డారు.తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఫీజు బకాయిలు,విద్యార్థుల సమస్యల ను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్న విద్యాశాఖ మంత్రిని నియమించ టకపోవడం సిగ్గుచేటని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించా లని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జాలపెల్లి మనోజ్ కుమార్, జిల్లా గర్ల్స్ కన్వీనర్ సంజన,జిల్లా కమిటీ సభ్యులు శివ,రాకేష్ నాయకులు దినేష్,జశ్వంత్,వినయ్, అరుణ్,శివ సాయి,మధు,అక్షయ,మనీషా,రుచిత, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ 31 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**సూర్య, వీణవంక**



ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం వీణవంక మండలం నర్సింగాపూర్ గ్రామంలో గ్రామ శాఖ అధ్యక్షుడు దాసారపు కృష్ణం రాజు జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. పద్మ శ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ప్రతి ఊరిలో జెండా ఆవిష్కరించి జాతి ఎదుగుదల కోసం ప్రతి మాదిగ బిడ్డలు పని చేయాలని పిలుపునిచ్చారు. అలాగే రేపు జరగబోయే వృద్ధులు, వితంతువులు, వికలాంగుల పెన్షన్ లు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి అంతడుపుల సంపత్ మాదిగ, దాసారపు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ దాసారపు సతీష్, కందే మహేందర్, బాయిని విద్యాసాగర్, దాసారపు గురువయ్య, రాచపల్లి పూర్ణచందర్, దాసారపు సమ్మయ్య, దాసారపు రాజు తదితరులు పాల్గొన్నారు.

### - మండల కేంద్రంలో....

వీణవంక మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జి దేవుని రవీందర్ మాదిగ మాట్లాడుతూ మాదిగల ఉద్యమం మానవతా ఉద్యమంగా మారిందని, అన్ని వర్గాల ప్రజల కొరకు మానవత్వ ఉద్యమంగా మారిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా నాయకులు అంబాల మధునయ్య, కండ్డే మహేందర్, మాజీ జడ్పిటిసి దాసారపు ప్రభాకర్, దాసారపు రాధాకృష్ణ, వల్భాపూర్ మాజీ సర్పంచ్ మారుముల్ల కొమురయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు దాసారపు అశోక్, దాసారపు రాజు, కృష్ణ కాంత్, కుమార్, క్రాంతి, శ్యామ్, బన్ని, అజయ్, దామోదర్, మిట్టపల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సైకిల్ పంపిణీ

**సూర్య కొత్తపల్లి కరీంనగర్ రూరల్**



కరీంనగర్ రూరల్ మండలం ముగ్ధంపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మానేరు లైన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో పదవ తరగతి చదువుతున్న నారాయణరావు పల్లెకు చెందిన1, గంధం గాయత్రి 2, కల్లెం సంధ్య ఇద్దరు బాలికలకు రెండు సైకిళ్ళు అందజేశారు. అలాగే స్కూలులో సంపుకు మోటర్ లేనందున సంపులోని మోటార్ను లయన్ శివనాథుని వెంకటేశ్వర్లు 25 వేల రూపాయలతో 1,సంపు మోటర్ 2, సైకిల్లు రెండు కొనిచ్చినటువంటి దాత శివనాథుని వెంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానేరు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ముత్యం శంకర్ గౌడ్ క్లబ్ సెక్రటరీ జిల్లా కృష్ణ ట్రెజరర్ సంద రాజశేఖర్ కృష్ణ కిషోర్ చింత సురేష్ పడమటింటి రమేష్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు స్కూల్ టీచర్స్ పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

**సూర్య, జమ్మికుంట రూరల్**




జమ్మికుంట మండలంలోని కోరపల్లి, వెంకటేశ్వర్లపల్లి గ్రామాలలో సోమవారం కోరపల్లి మాజీ సర్పంచ్ బోయిని సమ్మయ్య ఆధ్వర్యంలో కోరపల్లి, వెంకటేశ్వర్లపల్లి గ్రామాల్లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం, వేల గొంతులు లక్ష డప్పులు మహా కళా ప్రదర్శన నిర్వహణ కమిటి తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి రామంచ భరత్ లు హాజరయ్యారు. అనంతరం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు కొబ్బరికాయలు కొట్టి జెండాలను ఆవిష్కరించారు. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కోరపల్లి మాజీ సర్పంచ్ బోయిని సమ్మయ్య మాట్లాడుతూ మాదిగ జాతికి జరుగుతున్న విద్య, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్ల అన్యాయాలపై మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ 31 సంవత్సరాల క్రితం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని స్థాపించి ప్రకాశం జిల్లా ఈదుమూడి నుండి ప్రారంభమైన ఉద్యమం ఈరోజు దేశవ్యాప్తంగా విస్తరించిందని, కృష్ణ మాదిగ మాదిగ జాతికే కాకుండా అట్టడుగు వర్గాల ప్రజలే కాకుండా అగ్రవర్ణ ప్రజలకు ఏ సమస్య వచ్చినా తను ముందుండి పోరాడి వారి హక్కులను సాధిస్తారని అన్నారు. గతంలో కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్లను తగ్గిస్తానని ప్రకటన చేసిన వెంటనే భారతదేశ వ్యాప్తంగా ఉన్న రాష్ట్రాలలో పర్యటించి అన్ని రాష్ట్రాలలో ఉన్న దళితులను ఏకతాటిపైకి తీసుకువచ్చి ప్రతిపక్ష పార్టీలను సహకారం తీసుకొని ఎన్డీఏ ప్రభుత్వాన్ని మెడల్ వంచి రిజర్వేషన్లను తొలగిస్తానన్నా ప్రకటనను వెనక్కు తీసుకునే విధంగా ప్రత్యేక పోరాటం చేశారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో అనేక అవమానాలు ఎదుర్కొన్న వెనకాడకుండా సుదీర్ఘంగా 30 సంవత్సరాలు పోరాటం చేసి సుప్రీంకోర్టు నుండి ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చి భారత ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వాలను ఒప్పించి షెడ్యూల్ కులాల ఎస్సీ వర్గీకరణ సాధించిన ఘనత మందకృష్ణ మాదిగ దక్కిందని, కేంద్ర ప్రభుత్వం పై సంవత్సరాలు ఆయన చేసిన పోరాటాన్ని గుర్తించి పద్మశ్రీ అవార్డును ప్రధానం చేయడం యావత్తు భారతదేశ ప్రజలకే గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు, మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ గిరవేన ఓదెలు, వెంకటేశ్వర్ల పల్లి మాజీ ఉప సర్పంచ్ పోల్సాని శ్రీనివాసరావు, మాజీ వార్డ్ మెంబర్ బండారి రాజ్ కుమార్, బుడగ జంగం జిల్లా నాయకులు రేపెల్లి వెంకటేష్, నేతకాని సంఘం నాయకులు కొండు బిక్షపతి, హమాలి సంఘం నాయకులు బండారి శ్రీధర్, బిజెపి నాయకులు రెంటాల మహేందర్, నాయి బ్రాహ్మణ సంఘం కొత్తగట్టు సంపత్, మైనార్టీ నాయకుడు ఎండి. రహీం, యాదవ సంఘం అధ్యక్షులు గిరవైన సతీష్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువుకు ఆనుకొని ఉన్న రోడ్లను మరమ్మతులు చేయాలి

**- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కవ్వంపల్లి అజయ్ వడ్ల రాజు**

**సూర్య కొత్తపల్లి**



కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొత్త పెల్లి గ్రామంలో ఉన్న చెరువుకు ఆనుకొని ఉన్న రోడ్డుకు మధ్య గోడ గాని ఫినిషింగ్ కానీ నిర్మించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈరోజు కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చారు.వారు మాట్లాడుతూ కొత్తపల్లి చెరువు దగ్గర రోడ్డు నుండి వచ్చే వాహనాలకు ప్రమాదాలు జరుగుతున్నవి మొన్నటికి మొన్న రెండు లారీలు ఢీకొని ప్రమాదాలకు గురైన ప్రమాదాలకు గురి కాకుండా అధికారులు వెంటనే దీని మీద చర్యలు తీసుకొని రోడ్డుకు చెరువుకు మధ్యల గోడ గాని ఫినిషింగ్ గాని మరమ్మతులు చేయాలని వాహనాల దారులకు ప్రమాదం నుండి తప్పించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**సూర్య కొత్తపల్లి**



తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నెరవేర్చడంలో తీవ్రంగా విఫలం అయింది అని బి ఆర్ ఎస్ పార్టీ చొప్పదండి నియోజకవర్గం నాయకులు న్యాయవాది కట్టే కోల లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు గృహ అవసరాలకు సిలిండర్ లో రాయితీ కల్పిస్తామని చెప్పి హామీ ఇచ్చిన ఇంతవరకు నెరవేర్చలేదు అని అదేవిధంగా మహాలక్ష్మి పథకం కింద డబ్బులు ఇస్తామని చెప్పి ఇవ్వలేదు విద్యార్థులు యువతకు ఇచ్చిన ఏ హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ సఫలం కాలేదు అని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేకపోతే రాబోవు స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలలో ప్రజలే బుద్ధి చెప్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## ఘనంగా ఊరురా ఏమ్మార్పీఏస్ జెండాలావిష్కరణ.

**- మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు**

**సూర్య, ఇల్లంతకుంట**

ఏమ్మార్పీఏస్ జెండాలను మండల కేంద్రంతో పాటు,ఊరురా మండల,గ్రామ శాఖల అధ్యక్షులు జెండాలను ఘనంగా ఆవిష్కరించారు.సోమవారం ఏమ్మార్పీఏస్ 31 వ ఆవిర్భావ దినోత్సవాన్ని,ఏమ్మార్పీఏస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ 60 వ జన్మదిన వేడుకను పురస్కరించుకొని మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట, గ్రామాల్లో గ్రామ కూడాలి లో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకొని, బానాసంచాలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మంద రాజు, రాష్ట్ర, జిల్లా, మండల సీనియర్ నాయకులు మాట్లాడుతూ ఏమ్మార్పీఏస్ ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా మంద కృష్ణ మాదిగ దేశ చరిత్ర లోనే అలుపెరగని పోరాటం చేసి వర్గీకరణ సాధించారని కొనియాడారు.తోలుత గ్రామాల్లో వున్న అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి జెండాలావిష్కరణ, జన్మదిన కేక్ లు కట్ చేసుకున్నారు.ఈ సమావేశంలో సీనియర్స్ నాయకులు అంబేద్కర్ సంఘాల మండల అధ్యక్షులు తడకపల్లి భూమయ్య,మండల ఏమ్మార్పీఏస్ మాజీ అధ్యక్షులు గన్నేరం మల్లయ్య, మంద రాములు,బట్టు శ్రీనివాస్, రాగటి దేవదాస్,పసుల వెంకటి, కాసుపాక శంకర్, గుండ్రేటి రాజు,జుట్టు వినోద్, మండల ఉపాధ్యక్షులు పట్నం మహేందర్,రాగటి రమేష్, తదితరులు, గ్రామ శాఖల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, భారీ సంఖ్యలో మాదిగలు పాల్గొన్నారు.

## గెస్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కేంద్ర హెూం సహాయమంత్రికి వినతి

**సూర్య మేడిపల్లి**



మండలంలోని పలు గ్రామాలలో అభివృద్ధి పనులను ప్రారంభించడానికి వచ్చిన కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ని సోమవారం రోజు జూనియర్ కళాశాల గెస్ట్ లెక్చరర్లు కలిసి తమ వినతిపత్రాన్ని సమర్పించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వం12 నెలల వేతనం చెల్లించాలని కోరారు. నాలుగు నెలల నుండి జీతాలు రావడంలేదని తెలిపారు. మంత్రి బండి సంజయ్ సానుకూలంగా స్పందించి ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ కృష్ణ ఆదిత్య దృష్టికి తీసుకెళ్తానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్ల జిల్లా ప్రెసిడెంట్ గుర్రాల సాయి కృష్ణ, రాంబాబు, లక్ష్మణ్, జ్ఞానేశ్వర్, నాగేశ్వరి లు పాల్గొన్నారు.

## సక్సెస్ ఈజ్ నాట్ ద డెస్టినేషన్

**- నెవెర్ గివప్ అంటిల్ యు రీచ్ ద గోల్**

**- యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ముల్కల కుమార్**

**సూర్య చొప్పదండి**



గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ 2025 ఎస్ఎస్సి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చొప్పదండి మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు మెమొంటో, డిక్షనరీలను కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చొప్పదండి మండలం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నరేశ్ రెడ్డి చేతుల మీదుగా అందించారు.పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ అధ్యక్షత వహించిన ఇట్టి కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా హాజరైన యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ముల్కల కుమార్ మాట్లాడ ుతూ పదవ తరగతిలో విజయం సాధించడం మొదటి మెట్టు మాత్రమేనని, ఇంటర్,డిగ్రీ ఉన్నత విద్యలో సైతం సక్సెస్ సాధించి విద్యార్థు లు జీవితంలో నిర్ధారించుకున్న నిర్దిష్ట గమ్యాలను చేరుకోవాలని పిలుపునిచ్చారు.విద్యార్థులు చెడు స్నేహాలు,సెల్ ఫోన్స్ వదిలి పుస్తకాలతో స్నేహాన్ని చేయాలని కోరారు. దండన కన్నా బహుమతులు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి అంతులేని ఉత్సాహాన్ని అందించి సత్ఫలితాల సాధనలో ఉత్ప్రేరకాలుగా ఉపయోగపడతాయన్నారు.గత 15 సంవత్స రాలుగా మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఉమ్మడి కరీంనగర్, వరంగల్,సిద్దిపేట జిల్లాలలో విద్యార్థులకు ప్లేట్స్, బహుమతులు,ఎగ్జామ్ ప్యాడ్స్,నగదు ప్రోత్సాహకాలు అందిస్తూ ప్రోత్సహిస్తూ మరోవైపు నిరుపేదలకు దుప్పట్లు,కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందిస్తూ ట్రస్ట్ తనఔదార్యాన్ని చాటుతున్న తీరును అభినందించారు.ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి మోహన్ జెడ్పి స్కూళ్లలో ప్రథమ ద్వితీయ తృతీయ టాపర్స్ గా నిలిచిన విద్యార్థులు జే.అక్షయ,జ్యోతి,హర్షిని లకు ?1500 నగదు బహుమతిని అందించారు.చొప్పదండి గర్ల్స్ హై స్కూల్లో జీవశాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ర్యాకం మహేష్ స్కూల్ టాపర్ గా నిలిచిన హర్షిని కి ?10000/-నగదు బహుమతిని అందించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు.

## ఎమ్మార్పీఎస్ 31 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**సూర్య ఎండపల్లి**

ఎండపల్లి మండలంలో ఎమ్మార్పీ 31 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్చార్జి చెన్నూరు శ్రీనివాస్, విశిష్ట అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి మోకినేపల్లి సతీష్, ఆధ్వర్యంలో ఉమ్మడి ఎండపల్లి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కుమారస్వామి ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగల హక్కులు రిజర్వేషన్ల సాధనకై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ని ఈదుముడిలో మందకృష్ణ మాదిగ ఆలోచన స్ఫూర్తితో పురుడు పోసుకున్న ఎమ్మార్పీఎస్ నేడు వర్గీకరణ లక్ష్యాన్ని సాధించిన బడుగు బలహీన వర్గాల పక్షాన నిలిచిందని అన్నారు. నేడు రాష్ట్రంలో అమలవుతున్న ఆరోగ్యశ్రీ వింతతు,దివ్యాంగుల పెన్షన్ ఉద్యోగుల పదోన్నలతో రిజర్వేషన్లు అమలుపరిచిన ఘనత మందకృష్ణ మాదిగ అని అన్నారు. కృష్ణ మాదిగ సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించిందని ఆయన తెలిపారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు

**సూర్య మేడిపల్లి / భీమారం**



మండల కేంద్రంలో 31వ ఎంఆర్పిఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను భీమారం మండల ఎమ్మార్పీఎస్ ప్రెసిడెంట్ చిలివేరి వెంకటేష్ జెండా ఆవిష్కరించి ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం ఉమ్మడి మేడిపల్లి మండల ప్రెసిడెంట్ బంగారు దీపక్ పాల్గొని మాట్లాడారు. మాదిగ ప్రజలకు, సామాజికవేత్తలకు, ప్రజా సంఘాలకు ఉద్యమాలలో సహకరించిన ప్రతి ఒక్కరికి దండోరా ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యమాలలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు జోహార్లు తెలిపారు. ఈ వర్గీకరణ సాధన విజయం అమరవీరులకే అంకితం అన్నారు. ఈ కార్యక్రమంలో భీమారం గ్రామ మాజీ సర్పంచులు ఉత్కం శంకర్ గౌడ్, చెక్కపల్లి అరుణ, మాజీ ఉపసర్పంచ్ బసవరాజుల రాజు, మండల బిజెపి పార్టీ మాజీ ప్రెసిడెంట్ ముంజ శ్రీనివాస్, గల్ఫ్ జేఏసీ కన్వీనర్ గుగ్గిళ్ళ రవి గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చెక్కపల్లి రఘు, బొమ్మన ప్రశాంత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వినతి పత్రం అందజేత

**సూర్య ఇల్లంతకుంట**

మద్య మానేరు రైట్ కెనాల్(తోటపెల్లి)కు నీరు విడుదల చేయాలని వల్లంపట్ల,వంతడ్పుల,కిష్టారావుపల్లి,గాలిపల్లి రంగపేట గ్రామాల రైతులు కలిసి నార్లు ముదిరిపోతున్నాయని వెంటనే నీళ్లు విడుదల చేయాలని మండల రెవెన్యూ అధికారి ఇల్లంతకుంట గారికి వినతి పత్రం అందజేశారు. నీళ్ళు విడుదల చేయని పక్షంలో వంతడ్పుల వంతెనపై పెద్దఎత్తున దర్నా చేపడుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కేవియన్ రెడ్డి,రవిందర్ రెడ్డి,కరుణాకర్ రెడ్డి,పండుగ బాస్కర్,పెంటల నరేష్,శ్రీనివాస్ మరియు రైతులు పాల్గొన్నారు.



### అత్యుత్తమ ఫలితాలు సాధించిన జగిత్యాల

# ప్రభుత్వ మహిళా అటానమస్ కళాశాల

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

అటానమస్ హోదా పొందిన తరువాత నిర్వహించిన బిఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ మొదటి సంవత్సరం రెండవ సెమిస్టర్ ఫలితాలను ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) జగిత్యాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ సోమవారం శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డా. సురేష్ కుమార్ కళాశాలలో ఆమోదించిన తర్వాత విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ మొత్తం 225 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 158 మంది ఉత్తీర్ణత సాధించారని, మొత్తంగా కళాశాల ఉత్తీర్ణత శాతం 70.22 % గా ఉందని, బి.ఏ.లో 77.78%, బి.కాం.లో 58.33%, బి.ఎస్సి లైఫ్ సెన్సెస్ లో 95.45% మరియు బి.ఎస్సి ఫిజికల్ సైన్స్ లో 69.57% మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ముఖ్యంగా హిందీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్ మొదలగు విద్యార్థులు 100% ఫలితాలు సాధించినందుకు వారిని అభినందించారు. ఈ ఫలితాలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఇతర



శాతవాహన విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలు సాధించిన పరీక్షల ఫలితాల కంటే మెరుగ్గా ఉన్నాయని వివరించారు. అటానమస్ హోదా వల్ల ఫలితాల్లో కళాశాల గణనీయమైన ప్రగతి సాధించిందన్నారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణను విజయవంతం చేసిన పరీక్షల నియంత్రణ అధికారులు డాక్టర్ టీ. ప్రమోద్ కుమార్, డా. వి. వరప్రసాద్, ఎన్ సంగీత రాణి సహకరించిన వివిధ సబ్జెక్టుల విభాగాధిపతులకు అభినందనలు తెలియజేశారు. పరీక్షల ఫలితాలు కళాశాల వెబ్సైట్లో అందుబాటులో ఉంటాయన్నారు. అనంతరం అత్యుత్తమ ఫలితాలు సాధించినందుకు గాను జగిత్యాల ప్రభుత్వ మహిళా అటానమస్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు, అధ్యాపకులకు ప్రిన్సిపాల్ తదితరులకు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డా. సురేష్ కుమార్ అభినందనలు తెలియజేశారు. అనంతరం కళాశాల పక్షాన వారిని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అకాడమిక్ కో-ఆర్డినేటర్ కె. రామచంద్రం, వైస్ ప్రిన్సిపల్ జి. చంద్రయ్య, ఐ.క్యు.ఏ.సి కో-ఆర్డినేటర్ డా. ఎన్. వాసవి, టి.యస్. కె.సి. సమన్వయకులు జి.నీరజ, అధ్యాపకులు ఎంఏ రహీమ్, ఎస్ మల్లికార్జున్, డా. జమున పాల్గొన్నారు.

# రేపు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి.

**- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి. గన్నేరం నర్సయ్య**

**సూర్య. ఇల్లంతకుంట**

రేపు (బుధవారం)నిర్వహించనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గన్నేరం నర్సయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని తొమ్మిది కార్మిక సంఘాలు ఈ సమ్మెలో పాల్గొంటున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా అన్ని కార్మిక సంఘాలు ఈ సమ్మెకు పూర్తి మద్దతు ఇస్తున్నాయని తెలిపారు.కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నుండి కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతూ వారి హక్కులను హరిస్తుందని,అందులో భాగంగానే ఈ 4 లేబర్ కోడ్ లు తీసుకువచ్చిందన్నారు.బిజెపి పాలిత రాష్ట్రాల్లో కార్మిక చట్టాలు మార్చి 8 గంటల పని విధానాన్ని రద్దుచేసి10 గంటల పని విధానాన్ని అమలు చేస్తుందని, ఆంధ్రప్రదేశ్ లో కూడా 10 గంటలవిధానాన్ని అమలు చేయడం కోసం అక్కడికూటమి ప్రభుత్వం తీర్మానం చేసిందన్నారు. ఈ 4 లేబర్ కోడ్ ల వల్ల ఈ



దేశంలో కార్మిక చట్టాలు లేకుండా చేయడమే బిజెపి యొక్క ముఖ్య ఉద్దేశమని కార్పొరేట్ సంస్థల కోసం కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మె లో అందరూ భాగస్వాములై సమ్మెను విజయవంతం చేయాలని ప్రజలు మరియు ఉద్యోగ కార్మిక మేధావులు ఇట్టి సమ్మెకు మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ గ్రామపంచాయతీ యూనియన్ మండల అధ్యక్షులు వర్కోలు మల్లయ్య, సీఐటీయూ హమాలి సంఘం జిల్లా అధ్యక్షులు సావనపేల్లి రాములు, అయిక్స్ రైతు సంఘం నాయకులు సామ నరసింహా రెడ్డి, సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సావనపేల్లి ప్రభాకర్, జేరిపోతు పోచయ్య, కుంబాల పోచమ్మ, న్యాత కనకయ్య, బత్తుల ఎల్లం, తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 9న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

**సూర్య సిరిసిల్ల టౌన్**

జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం పని గంటలు పెంచుతూ తీసుకొచ్చిన జీవో నెంబర్ 282 ను వెంటనే ఉపసంహరిం చుకోవాలనీ సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ పిలుపునిచ్చారు.రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో హాస్పిటల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం పని గంటలు పెంచుతూ తీసుకొచ్చిన జీవో నెంబర్ 282 ని ఉపసంహరించుకోవాలని నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మిక హక్కులను హరించే విధంగా,కార్మికులను కట్టు బానిసలు చేసే విధంగా తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కార్డులను రద్దు చేయాలని కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలని కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు అందించాలని తదితర డిమాండ్లతో జూలై 9న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో హాస్పిటల్లో పనిచేస్తున్న శానిటేషన్,పేషంట్ కేర్ సెక్యూరిటీ గార్డ్ కార్మికులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు.జూలై 9వ తేదీన సిరిసిల్ల ఎమ్మార్వో ఆఫీస్ నుండి అంబేద్కర్ చౌక్ వరకు వేలాది మంది కార్మికులతో ర్యాలీ ప్రదర్శన చేపట్టి అంబేద్కర్ చౌక్ వద్ద మహా ధర్నా చేపట్టడం జరుగుతుందని ఇట్టి కార్యక్రమంలో హాస్పిటల్లో పనిచేస్తున్న శానిటేషన్,పేషెంట్ కేర్ , కార్మికు లందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో సుజాత, నాగమణి, పద్మ, రజిత, దేవలక్ష్మి, రాజవ్వ, లక్ష్మి,శ్రీను,తిరుపతి,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# స్తంభంపెల్లి హై లెవెల్ వంతెన పూర్తి చేయండి

**- ప్రజావాణిలో కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చినము- అక్కెనపల్లి కరుణాకర్**

**సూర్య బోయినపల్లి**



మండలం స్తంభంపల్లి గ్రామంలో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న హై లెవెల్ వంతెన పనులు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అక్కెనపెల్లి కరుణాకర్ మాట్లాడుతూ ప్రజావాణిలో చాలాసార్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్తంభంపల్లి గ్రామానికి సంబంధించిన హై లెవెల్ వంతెన యొక్క పనులు పూర్తి కాకపోవడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని. అదేవిధంగా వర్షాకాలం మొదలవుతే ప్రయాణికులకు, రైతులకు, నిత్యం స్కూలుకు వెళ్లే విద్యార్థినీ విద్యార్థులకు, కూలీ నాలి పని చేసుకునేటువంటి ప్రజలకు చిన్నపాటి వర్షం పడడంతోనే ప్రవాహం ఉధృతమై కల్వర్టు దాటడానికి తీవ్ర ఇబ్బంది అవుతుందని చాలాసార్లు కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చామని, చివరికి గ్రామ ప్రజలు పాదయాత్ర, బైక్ ర్యాలీలు చేస్తూ నిరసన తెలిపినప్పటికీ. అధికారుల నుండి ఎలాంటి స్పందన లేకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ చర్య తీసుకుని హై లెవెల్ వంతెన పనులు పూర్తి చేసే విధంగా సహకరించగలరని కలెక్టర్కు వినతి పత్రం రూపకంగా వీలైనంత తొందరగా ఈ సమస్యకు పరిష్కారం చూపెట్టాలని స్థంభంపల్లి గ్రామ ప్రజలు మరియు పరిసర ప్రాంత ప్రజలు కోరుకోవడంతో కలెక్టర్ వెంటనే సంబంధిత పి ఆర్ ఈ ఈ డిపార్ట్మెంట్ పిలిపించి పనులు పూర్తి అయ్యేలా ఆదేశించారు.



# విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేత

**సూర్య చొప్పదండి**

మధురమ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ ఆధ్వర్యంలో చొప్పదండి మండలం గర్ల్స్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన పది విద్యార్థులకు - ప్రతిభా పురస్కారాల కార్యక్రమం సోమవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్ ఐ నరేష్ రెడ్డి,ఎంఈఓ మోహన్ హాజరై విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం ఎస్సై నరేష్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చెడు వ్యసనాలను,చెడు స్నేహాలను వదలండి - ఎంచుకున్న లక్ష్యాలకు చేరువకండి అంటూ విద్యార్థులకు పిలుపు నిచ్చారు.టీనేజ్ వయసులో కలత కన్ఫ్యూజన్ ఒత్తిడిలు సహజమని పెద్దలు ఉపాధ్యాయుల సలహాలు తీసుకోవాలని సూచించారు. ఎంఈఓ మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మధురమ్మ ట్రస్ట్ బహుమతులు అందించడం అభినందనీయమన్నారు. మండల టాపర్స్ గా నిలిచిన ముగ్గురికి రూ:1500 నగదు ప్రోత్సాహం అందించారు.చొప్పదండి గర్ల్స్ హైస్కూల్ ఉపాధ్యాయుడు ర్యాకం మహేష్ స్కూల్ టాపర్గా నిలిచిన విద్యార్థిని హర్షిని కి రూ :10000 నగదు ప్రోత్సాహకం అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అతిధులుగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ముల్కల కుమార్,మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సుధాకర్ పాల్గొన్నారు.

# సమ్మెను విజయవంతం చేయాలంటూ బైక్ ర్యాలీ

**సూర్య సిరిసిల్ల టౌన్**

కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాల ఉమ్మడి కార్యాచరణ ఆధ్వర్యంలో జూలై 9న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.కొత్త బస్టాండ్ నుండి అంబేద్కర్,నేతన్న పైలాన్ మీదుగా కొండా లక్ష్మణ్ బాపూజీ వరకు బైక్ ర్యాలీని నిర్వహించి జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఉద్యోగ కార్మిక సంఘాలను పిలుపునివ్వడం జరిగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో మూడవసారి అధికారంలో కి వచ్చిన బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాల నుండి 29 కార్మిక చట్టాలను నాలుగు కోడులుగా మార్చి దేశ కార్మికులను బానిసలను చేసే విధంగా 8 గంటల పని విధానం సమ్మె చేసే హక్కు సంఘం పెట్టుకునే హక్కు లాంటివి,కనీస వేతనాల చట్టం అమలు కాకుండా ఎఫ్డిఐ లకు దేశీయ పారిశ్రామిక వర్గాలకు సహజ సంపదలను దోచిపెట్టడానికి బ్రిటిష్ హయాంలో సైతం కొట్లాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తూ నిర్ణయం తీసుకోవడాన్నీ నిరసిస్తూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను చేయడం జరుగుతుందని తెలిపారు.

# ‘ఖని’ లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**సూర్య-గోదావరిఖని:**
ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను సోమవారం పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులు కన్నూరి ధర్మేందర్ మాదిగ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏ.శంకర్ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) మాదిగ, మాదిగ అనుబంధ కులాలతో 1994 జూలై 7 న ఆంధ్రప్రదేశ్



రాష్ట్రం ప్రకాశం జిల్లా లో 20 మంది యువకులతో ఏర్పడి.. ఎస్సీ రిజర్వేషన్ లు.. ఎస్సీ కులాల జనాభా నిష్పత్తి ప్రకారం విభజించి, దళితుల్లో అత్యధికంగా వెనుకబడిన కులాలకు న్యాయం చెయ్యాలనే డిమాండ్ తో దండోరా ఉద్యమం, ఎమ్మార్పీఎస్ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ముందుకు వచ్చిందని గుర్తు చేశారు. ఆనాటి నుండి నిన్న మొన్నటి వరకు జరిగిన పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ జరిగిందని వివరించారు. మంద కృష్ణ మాదిగ కు కేంద్రం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ అవార్డును ప్రకటించడం గొప్ప విషయం అని, భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డును అందుకోవడం గర్వంగా ఉంది అని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జి.రాకేష్ మాదిగ, కాసిపేట రాజయ్య, పల్లె బాబు మాదిగ, ఈదునూరి కొమురయ్య, రాచర్ల రాజేష్, కాంపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**సూర్య,రాయికల్**



ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రాయికల్ పట్టణం లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద జెండా ఆవిష్కరించి సంబరాలు జరిపారు.అనంతరం నాయకులు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేయాలనీ అన్నారు.మన హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని ప్రతిన బునారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఆశయ సాధన కోసం కృషిచేసి అమరులైన వారికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దొబ్బల వేణు,ఎమ్మార్పీఎస్ మండల నాయకులు బెక్కం వెంకటేష్, బాపురపు నరసయ్య,తలారి రాజేష్, మారం పెల్లి సాయికుమార్, పాలెపు బాలరాజు,నిఘా భూమేష్,బొమ్మేనా ప్రకాష్,రాజేష్,ప్రవీణ్,శ్రీనివాస్, మల్లేష్,నరేష్,దిలీప్ తదితరులు పాల్గొన్నారు

## కాలం చెల్లిన బిస్కెట్లు విక్రయం

**- ప్రజలు, చిన్నారుల ప్రాణాలతో చెలగాటం**

**సూర్య, ఎల్లారెడ్డిపేట**




తన పిల్లల కోసం బిస్కెట్లు కొనడానికి వెళ్లిన ఓ వ్యక్తి కిరణం యజమాని ఇచ్చిన బిస్కెట్ ప్యాకెట్ పై కాలం చెల్లిన తేదీ ఉండడం చూసి అవాక్కయ్యాడు. పొరపాటున వాటిని తింటే పిల్లలు అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉందని సదరు వ్యక్తి వాపోయాడు. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన అజీజ్ తన పిల్లల కోసం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సన్ ఫీస్ట్ (అల్ రౌండర్ స్వీట్ సాల్టీ) ప్యాకెట్ కొని తీసుకెళ్లాడు. ప్యాకెట్ విప్పి చూడగా అందులో చీమలు దర్శనమివ్వడంతో ఖంగుతిన్నాడు. బిస్కెట్లను నవంబర్ 19 , 2024 నాడు తయారు చేయగా, దానిపై ఎక్స్ పైరీ తేదీ మే 17 , 2025 ఉండడంతో అవాక్క య్యాడు. పిల్లలు తినే బిస్కెట్ ప్యాకెట్ కనీసం తేదీ చూడకుండా అమ్మడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఎలాంటి నిబంధనలు పాటించకుండా కాలం చెల్లిన వస్తువులు విక్రయిస్తున్న వ్యాపారస్తులపై సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని అజీజ్ తో పాటు ప్రజలు కోరుతున్నారు.

## బిఎల్ ఓ లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం

**సూర్య ఇల్లందకుంట**

ఇల్లందకుంట మండల తాహసిల్దార్ వెంకట్ రెడ్డి( ఎఫ్ఏసి)ఆధ్వర్యంలో బూత్ లెవెల్ ఆఫీసర్లకు, సూపర్వైజర్లకు శిక్షణ తరగతులను సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులకు కొత్త ఓటర్ నమోదు ప్రక్రియను అలాగే ఇది వరకే ఓటర్ కార్డు కలిగి ఉండి మార్పులు చేర్పులు చేసుకునే అంశాల పైన వివరించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వెంకటరెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ సర్దార్ మన్విత్ సింగ్, గిరిధవర్ నాగరాజు, జూనియర్ అసిస్టెంట్లు శ్రీనివాస్ తదితర రెవెన్యూ సిబ్బంది, బూత్ లెవెల్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.



## నూతన కార్యవర్గం ఎన్నిక

**సూర్య, చొప్పదండి**



చొప్పదండి మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా బొడిగె అజయ్ కుమార్ గౌడ్ ని అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ సభ్యుల సమక్షంలో నిర్వహించిన ఎన్నికలో ఉపాధ్యక్షుడిగా నెల్లి శేఖర్, ప్రధాన కార్యదర్శిగా అనుమాండ్ల మహేష్, కోశాధికారిగా సింహాచలం కన్నా, ప్రచార కార్యదర్శిగా వడ్లురి శశి, ముఖ్య సలహాదారులుగా తాటి పెల్లి శివకుమార్, సిరిపురం శ్రీనివాస్ ,సామల కిషోర్, మాచర్ల శ్రీనివాస్, గజ్జల రమేష్, ఉడుత రమేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు

**సూర్య, హుజురాబాద్**



మాలల మనోభావాలను దెబ్బతీసిన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, పరకాల సమ్మయ్య గౌడ్ లపై హుజురాబాద్ పోలీస్ స్టేషన్ లో సోమవారం మాల మహానాడు నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కన్నమదాసు తల భాగంలో కౌశిక్ రెడ్డి తల ఫోటో పెట్టి మాల కన్న మదాసు ను, మాలలను అవమానపరుస్తూ మాలల మనోభావాలను దెబ్బతీసే విధంగా వాట్సాప్ గ్రూప్ లలో ఫోటోలను సర్క్యూలేట్ చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు సొల్లు బాబు, సందమల్ల నరేష్, మాల స్టూడెంట్ జాక్ చైర్మన్ మాదాసు రాహుల్, శీలం రాజు, పసుల స్వామి, జంగ అనిల్ కుమార్, తొగరు విజెందర్, ముక్క రమేష్, తాడెం నాగరాజు, ముక్క రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఆవిరిభవ దినోత్సవ వేడుకలు

**సూర్య వీర్నపల్లి**



వీర్నపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు గద్ద రాశి భగ వంతం అధ్వర్యంలో 31 వ ఎమ్మార్పీఎస్ ఆవిరిభవ దినోత్సవ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు జన్మదిన సందర్భంగా అంబేద్కర్ విగ్రహం కు పూల మాల సమర్పించి ప్రజా ప్రతినిధులు, పార్టి నేతలు కలుపుకొని అన్ని గ్రామాల్లో జెండాను ఆవిష్కరించారు .కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.అనంతరం సెస్ డైరెక్టర్ మల్లేశం, మాజి ఎంపిటిసి అరుణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్, సిపిఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, బిజెపి పార్టి మండల మాజి అధ్యక్షులు మల్లేశం, ప్రజా ప్రతినిధులకు, పార్టీల నేతలకు, ప్రజా సంఘాల నాయకులకు శాలువ కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాజేష్, మాజి సుతారీ సంఘం అధ్యక్షులు దేవయ్య,మండల నాయకులు నరేష్, దేవ రాజు, రాజం, గంగ రామ్, దేవయ్య , గంగ రాజు,బాబు, జలెందర్, చిన్న రాజం, రాజం, రాములు, శంకర్, నాంపల్లి, కృష్ణ, శంకర్, అశోక్, సంజీవ్, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిపై కేసు నమోదు

**సూర్య, ఎల్లారెడ్డిపేట**



అజాగ్రత్తగా వాహనం నడిపి ఓ వ్యక్తిని ఢీకొన్న ఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డిపేట ఎస్ఐ రాహుల్ రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళితే మండలంలోని తిమ్మాపూర్ కు చెందిన నల్ల నాగరాజు ఈ నెల 4 వ తేదీన తన ఎలక్ట్రిక్ వాహనంపై రాచర్ల తిమ్మాపూర్ నుండి గొల్లపల్లి గ్రామానికి వెళుతుండగా మార్గమధ్యలోని గొల్లపల్లి గ్రామ శివారులోని కోళ్ల ఫారం కల్వర్టు వద్ద చేరుకోగా, అదే సమయంలో సిరిసిల్ల వైపు నుండి వస్తున్న మాచారెడ్డి మండలం లచ్చాపేటకు చెందిన క్యాదం శ్రీనివాస్ తన స్విఫ్ట్ కారుని అతివేగంగా ఆజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి ఢీకొన్నాడు. ఈ ఘటనలో నాగరాజుకు గాయాలయ్యాయి.ఈ క్రమంలో బాధితుడి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

## లబ్ధిదారులు ఎవరికి డబ్బులు ఇవ్వద్దు

**- పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్**

**సూర్య సిరిసిల్ల టౌన్**




రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారుల నుండి ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడు డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ హెచ్చరించారు. సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చొప్పదండి ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత మ్రకంగా చేపట్టిన ఇందిర మహిళ నిర్మాణానికి సంబంధించి లబ్ధిదారుల నుండి ఏ ఒక్కరు డబ్బులు వసూలు చేయవద్దని హెచ్చరించారు.ప్రభుత్వ నిరుపేదలను దృష్టిలో పెట్టుకొని ఇండ్లను మంజూరు చేస్తుందని వాటిని ఆసరా చేసుకొని ఏ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త, నాయకులు డబ్బులు వసూలు చేయవద్దని అన్నారు.ప్రభుత్వానికి బదనాం చేసే పనులు ఎవరు చేయవద్దని ఒకవేళ చేస్తే వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. లబ్ధిదారులు ఎవరిని నమ్మి డబ్బులు ఇవ్వవద్దని ఎవరైనా డబ్బులు అడిగితే తమ దృష్టికి తీసుకురావాలని ప్రకాష్ కోరారు.ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకునూరి బాలరాజు,వైద్య శివప్రసాద్,ఆడెపు చంద్రకళ,కత్తెర దేవదాస్,తదితరులు పాల్గొన్నారు.

## చెల్పూర్ లో నేత్ర వైద్య శిబిరం సక్సెస్

**సూర్య, హుజురాబాద్ రూరల్**




హుజురాబాద్ మండలం చెల్పూర్ గ్రామంలో జయన్న ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఉచిత నేత్ర వైద్య శిబిరం సక్సెస్ అయ్యింది. గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరై నేత్ర పరీక్షలు ఉచితంగా జరుపుకున్నారు. పలువురికి మందులను ఉచితంగా అందజేశారు. కాగా కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించి హైదరాబాద్ లోని శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామని జయన్న ఫౌండేషన్ చైర్మన్ గుడిపాటి జైపాల్ రెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యురాలు గుడిపాటి సరితలు తెలిపారు. హుజురాబాద్ మండలంలో ఇప్పటి వరకు అన్ని గ్రామాల్లో జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించామని, ఇప్పటి వరకు సుమారు 700 మందికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు జరిపించినట్లు వారు తెలిపారు. పలువురిని శస్త్ర చికిత్స కోసం బస్సులో హైదరాబాద్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోలంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, వేల్పుల రత్నం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన మొహరం వేడుకలు

**సూర్య,రాయికల్**



డప్పు చప్పుల మధ్య,పెద్ద పులి వేషధారుల విన్యాసాల నడుమ, పిల్లలు,పెద్దల కేరింతల మధ్య రాయికల్ పట్టణం లో మొహరం వేడుకలు ఘనంగా ముగిశాయి.ఈ వేడుకలను తిలకించేందుకు యువకులు,మహిళలు,పిల్లలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.వేడుకల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రాయికల్ ఎస్సై సుధీర్ రావు,ఏ ఎస్సై దేవేందర్, పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజా ప్రతినిధులు,నాయకులు హాజరయ్యారు.